నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం
బాపట్ల
బుధవారం 8 అక్టోబరు 2025
పేజీలు 8





# నేడు ఏఎంసి కుర్చీపై 'చిట్టెం'

ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ వైస్ ఛైర్మన్‌గా చిట్టెం ప్రసాద్ నేడు ప్రమాణ స్వీకారం




## తాగునీటి సమస్య లేకుండా చూడాలి: మంత్రి డాక్టర్ స్వామి



టంగుటూరు, మేజర్ న్యూస్: కొండపి నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలపై మంత్రి చర్చించారు. నియోజకవర్గానికి మంజూరైన 66 శానిటరీ కాంప్లెక్స్ యూనిట్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టంగూటురులో పీఎం అజయ్ కింద రూ.45 లక్షలతో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం, జడ్పీ నిధులు రూ. 25 లక్షలతో పొన్నలూరు రావులకొల్లు ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం వెంటనే మెదలుపెట్టాలన్నారు. నియోజవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడ నీటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అందు బాటులో ఉంటూ ఏ గ్రామంలోనైనా నీటి సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలని మంత్రి స్వామి అన్నారు.

## ఒంగోలు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి: ఛైర్మన్ షేక్ రియాజ్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాల కృష్ణ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ అధికారులకు సూచించారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ 5వ ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి సమావేశాన్ని ప్రకాశం భవన్‌లో నిర్వహించారు. ఒడా ఛైర్మన్ షేక్. రియాజ్, జేసి గోపాల కృష్ణ రోనంకి, అథారిటి సభ్యులు సుపరిటెండెంట్ ఇంజినీరు, సుపరిటెండెంట్ ఇంజినీరు, ఒంగోలు, జిల్లా పర్యటక శాఖాదికారి, ఒంగోలు, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, ప్రకాశం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కాలుష్య నివారణ శాఖాధికారి, రీజనల్ డైరెక్టరు, టౌన్ ప్లానింగ్ గుంటూరు, ప్రత్యేక అతిదులుగా మున్సిపల్ కమీషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్, ఒంగోలు హాజరై ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థకు సంబంధించిన విషయాలుపై చర్చించారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థలో జరుగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి, యన్‌టిఆర్ స్మార్ట్ టౌన్ షిప్‌లు వినూత్న ఆలోచలతో కూడిన ప్రజలకు బహుళ ప్రయోజకరంగా ఉండే పార్కులు, ప్రాజెక్టులు మొదలగు వాటిని రూపొందించి ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థకు సమర్పించాలని, ఆనంతరం తగు చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలియజేశారు.






# వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలి

సూర్య ప్రతినిధి బాపట్ల



వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ధర్మబద్ధంగా ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని తెలిపారు. యుగాలు మారినా సైతం రామాయణం ఇచ్చే ఆదర్శాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. ప్రతి మనిషిలో ఉన్న చెడును తొలగించి మంచి దారిలో నడిపించే శక్తి వాల్మీకి రచనలో ఉందని ఆయన పేర్కొన్నారు. మొదటిసారిగా సంస్కృతంలో శ్లోకాలను రచించినందున వాల్మీకి మహర్షిని 'ఆది కవి'గా, రామాయణాన్ని 'ఆది కావ్యం'గా పరిగణించారన్నారు. రామాయణం ద్వారా మానవ సంబంధాలు, కుటుంబ విలువలు, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని సమాజానికి అందించారన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## యడ్లపల్లి అంగన్వాడీకి స్వచ్ఛంధ్ర అవార్డు

చుండూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: స్వచ్ఛభారత్ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా జిల్లాస్థాయిలో అమృతలూరు ప్రాజెక్ట్ పరిధిలోని చుండూరు మండలంలోని యడ్లపల్లి అంగన్వాడీ కేంద్రానికి మరియు వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు అంగన్వాడీ కేంద్రాలకు అవార్డులను లభించినట్లు అమృతలూరు ప్రాజెక్ట్ ఐసిడిఎస్ అధికారిని ఏ లక్ష్మీదేవి తెలి పారు. మంగళవారం సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025 లో యడ్లపల్లి కుచ్చెళ్ళపాడు అంగన్వాడి కేంద్రాల లో ఉత్తమ పరిశుభ్రత కార్యక్రమం అమలులో విశిష్టత ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో అవార్డులను అంగన్వాడీ కార్యకర్తలు ఏ మహాలక్ష్మి, అనసూయలు కలెక్టర్ వారి చేతుల మీదుగా అందుకున్నారన్నారు. గ్రామ ప్రజలు సహకారం సిడిపిఓ లక్ష్మీదేవి సూపర్వైజర్ శకుంతల వారి సూచనలతో పరిశుభ్రత కార్యక్రమాల పట్ల నిబద్ధత వల్ల ఈ విజయాన్ని సాధించామని అంగన్వాడి కార్యకర్త మహాలక్ష్మి తెలిపారు. ఈ అవార్డు రావడానికి తోడ్పడిన గ్రామ ప్రజలకు, సిడిపిఓ లక్ష్మీదేవికి ,సూపర్వైజర్స్ శకుంతల,ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




## కుచ్చెళ్ళపాడు అంగన్వాడీకి స్వచ్ఛంధ్ర అవార్డు

వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అమృతలూరు ప్రాజెక్ట్ పరిధిలోని వేమూరు మండలం ఎస్సీ ఏరియాలోని అంగన్వాడీ కేంద్రానికి జిల్లాస్థాయిలో స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు లభించినట్లు సిడిపిఓ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ అమృతలూరు ఐసిడి ఎస్ ప్రాజెక్టు పరిధిలోనే వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు చుండూరు మండలంలోని యడ్లపల్లి అంగన్వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న అనసూయ మహాలక్ష్మి లకు కలెక్టర్ చేతుల మీదగా స్వచ్ఛందంగా అవార్డుల లభించాయన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త అనసూయ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ లక్ష్మీదేవి సూపర్వైజర్ అమృతవాణి సూచనలతో అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతినెల మూడవ శనివారం అంగనవాడి పరిసరాలను కేంద్రాలను పరిశుభ్రత ను చేపట్టామన్నారు .నా ఇల్లు ఎలా పరిశుభ్రంగా ఉంటుందో అలాగే అంగన్వాడీ కేంద్రాలను కూడా పరిశుభ్రంగా ఉంచానన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు మా కేంద్రాన్ని సందర్శించి పిల్లల హ్యాండ్ వాష్ విధానాన్ని పరిసరాలు పరిశుభ్రత వంట గదులు పరశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి పై అధికారులకు రిపోర్టు పంపించగా జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది అన్నారు.అవార్డు రావడానికి సూచనలు సలహాలు ఇచ్చిన సిడిపిఓ లక్ష్మీదేవి సూపర్వైజర్ అమృతవానికి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



## నకిలీ మద్యం విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి

వేమూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్: నకిలీ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ కమిషనర్,ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె విజయ తెలియజేశారు.మంగళవారం వేమూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి కొందరు నకిలీ మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నారని అటువంటి వాటిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.నకిలీ మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి సత్వరమైన చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా నకిలీ మద్యం తయారీదారులపై కూడా దుస్తు సాధించాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు పురోగతిని గురించి అడిగి తెలుసుకు న్నారు. ఆమెతోపాటు ఎక్సైజ్ సీఐ రవి,ఎస్సై శ్రీరామ్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

## సూపర్‌చెక్ యాప్‌లో పంట నమోదు చేసుకోవాలి: ఆర్డీవో



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: మం డలంలోని రైతులు సూపర్ చెక్ యాప్‌లో పంట నమోదు చేసుకో వాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. మంగళవారం మండలం లోని ఆరుంబాక, గూడవల్లి గ్రామా లలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సూపర్ చెక్ రికార్డులను ఆర్డిఓ రామలక్ష్మి పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు పొలా లకు వెళ్లి రైతు పేరు, పంట రకము, పంట పేరు, విత్తిన తేదీ, సర్వే నెంబరు సరిగా ఉన్నా యో లేవో పరిశీలించి యాప్ లో నమోదు చేయాలి అని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ మండల పరి ధిలో పంట నమోదు 80 శాతం మాత్రమే ఇం కా 20% నమోదు చేయడం జరగలేదని ఆయన అన్నా రు. ఇంకా సుమారు 2500 ఎక రాలు పంట నమోదు జరగవలసి ఉందన్నారు. చేయించుకోవలసిన రైతులు ఈనెల 20వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పంట నమోదు చేయించు కోవాల న్నారు. పాసు పుస్తకం లేని రైతులకు మరియు నాన్ వెట్ ల్యాండ్ రైతులకు కూడా పంట నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసి ల్దార్ సిహెచ్ పద్మావతి, వ్యవసాయ విస్తరణ అధికారులు, బి డీ రామకృష్ణ, కే ప్రియాంక, తూము ప్రేమ కుమార్ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## జిఎస్టీ తగ్గింపుతో జీవన ప్రమాణాలు మెరుగుదల



కొల్లూరు, మేజర్‌న్యూస్: జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని దోనేపూడి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ ఫజరున్నిసా అన్నారు. మంగళవారం కిష్కిందపాలెం అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్స వాలలో భాగంగా మహిళలకు జీఎస్టీ తగ్గింపుపై పర్యావరణ పరి రక్షణపై అవ గాహన సదస్సులు నిర్వహించారు. ఈ సమావే శాలలో సూపర్వైజర్ ఫజరున్నిసా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విప్ల వాత్మకమైన మార్పుకు నాంది పలుకు తుందని జిఎస్టి రెండు స్లాబులగా పరిమితం చేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలు వినియోగించే వస్తు వుల రెట్లు గణనీయంగా తగ్గాయన్నారు కిరా ణా సామాగ్రి రోజువారి నిత్యవసరా లు ఆరోగ్యం మరియు జీవిత బీమా మందులు స్టేష నరీ వాటన్నిటిమీద జిఎస్టి రేట్లు తగ్గించార న్నా రు. కిచెన్ గార్డెన్ పెంపకంపై తల్లులకు సల హాలు ఇచ్చారన్నారు. పండించిన పంటలు అయినా ఆకుకూరలు కూరగాయలను వాడాల న్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీరాజ్యం, రత్న కు మారి, విమలమ్మ, తల్లులు పాల్గొన్నారు.

## అధికారుల గ్రామ పర్యటన సంతోషదాయకం



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో పలు ప్రభుత్వ శాఖల అధికారులకు జరుగుతున్న శిక్షణా తరగతులలో భాగంగా మంగళవారం 20 మంది అధికారులు నల్లమోతు వారి పాలెం గ్రామాన్ని సందర్శించి, గ్రామంలో అమలు చేయబడుచున్న మంచి నీటి సరఫరా, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై క్షుణ్ణంగా పరిశీలించటమే కాకుండా అన్ని విషయాలను రికార్డ్ చేసుకోవటం సంతోష దాయకం అని నల్లమోతువారి పాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, నల్లమోతు వారి పాలెం గ్రామానికి మంచి నీటి చెరువు లేనందువలను సుమారు మూడు కిలోమీటర్ల దూరం నుండి వాటర్ ట్యాంక్‌లోకి మంచి నీరు ఎక్కించుకొని గ్రామస్తులకు సరఫరా చేయటం ఇబ్బందికరంగా ఉంది అని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ శ్రీనివాసరావు, ఏఈ మంజూర్ బాషా, సెక్రటరీ షేక్ షాహిన్, టీడీపీ సీనియర్ నాయకులు మాడా శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ పార్టీ ఇంచార్జి మునిపల్లె చిన్నా, జనసేన నాయకులు గరిగంటి శ్రీనివాస రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## శక్తి యాప్ ఎంతో ఉపయోగం

నగరం, మేజర్‌న్యూస్: లైంగిక వేధింపులు, బెదిరింపులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి, స్థానిక ఎస్ఐ బండ్ల భార్గవ్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అద్దంకివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్, శక్తి టీం, గంజాయి నిర్మూలన, ఈగల్ టాస్క్ ఫోర్స్, ఫోక్సో చట్టాలు, ట్రాఫిక్ అవేర్‌నెస్‌పై అవగాహన కల్పించి మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పటికీ భయపడకుండా శక్తి యాప్ ద్వారా ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రేపల్లె సబ్ డివిజన్ శక్తి యాప్ టీం, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10న నగరంలో జాబ్‌మేళా



నగరం, మేజర్ న్యూస్: తీర ప్రాంత నిరుద్యోగులు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో దివీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలు పొందేందుకు స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి జాబ్ మేళా ఏర్పాటు చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు కళాశాలలో ఉద్యోగాలకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటిఐ, బిఎస్సీ కెమిస్ట్రీ, బి.టెక్, బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ మైక్రోబయాలజీలో అర్హతలతోపాటు శారీరక ధారుఢ్యం కలిగి, ఆరోగ్యవంతులైన 21-25 సంవత్సరాల వయస్సు వారికి అవకాశం కలదన్నారు. ఎంపికైన వారికి నెలకు 15-24 వేల రూపాయిలు జీతం వుంటుందని, నిరుద్యోగులు తమ బయోడాటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాల్గొన వచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9963465428, 9494609151 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## నేడు ఈదుపల్లి ఫీడర్ విద్యుత్తు సరఫరాలో అంతరాయం



నగరం, మేజర్‌న్యూస్: నగరం 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి ఈదుపల్లి ఫీడర్ మరమ్మతులు కారణంగా రేపు అనగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈదుపల్లి, తాడివాకవారిపాలెం, పూడివాడ, సిరిపూడి, కమ్మవారిపాలెం, ముత్తుపల్లి, వీటి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగరం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎండి నాగుల్‌మీరా తెలిపారు.




## ఛలో విజయవాడకు తరలిన యుటిఎఫ్ నేతలు

కనిగిరి, మేజర్‌న్యూస్: సిపిఎస్ రద్దు, ఆర్థిక, విద్యారంగ పరిరక్షణ కోసం ఫ్యాప్టో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గం నుంచి యుటిఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ యుటిఎఫ్ సీనియర్ కామ్రేడ్ ముక్కు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు సిపిఎస్ రద్దు గురించి ఆలోచించకపోవడం, ఆర్థికపరమైనటువంటి బకాయిల చెల్లింపులో నిర్లక్ష్య ధోరణి, ఉపాధ్యాయుల ఉద్యోగుల జీతభత్యాల పెంపుపై పిఆర్సి కమిటీ నియమించక పోవడం శోచనీయం అని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ ఖాజా రహంతుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాపుల భారాన్ని తగ్గించాలని, అనవసరపు కార్యక్రమాలు ఉపాధ్యాయులపై రుద్దరాదని, ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి టి.రమణారెడ్డి మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించాలని, వెంటనే బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని తెలియజేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ యం.రాము, కనిగిరి, వెలిగండ్ల, పిసి పల్లి, హనుమంతునిపాడు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు పట్నం నరసింహం, టివి సుబ్బారెడ్డి, ఉమహేశ్వరీ, ఏసుబాబు, రమేష్, బాలకృష్ణ, యుటిఎఫ్ కార్యకర్తలు తరలివెళ్లారు.

## జగన్‌ను కలిసిన కదిరి బాబురావు



కనిగిరి, మేజర్‌న్యూస్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశములో మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, విద్యా, వైద్య, సంక్షేమ రంగాలను నీరుగార్చారని ,కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి ఎండ గట్టాలని, అలాగే వైసీపి చేపట్టబోయే కార్యక్రమాల అమలు కార్యాచరణ, పార్టీ బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారని కదిరి బాబురావు తెలిపారు.

## గోనుగుంటలో విద్యార్థులకు జిఎస్టీపై అవగాహన



చీమకుర్తి, మేజర్‌న్యూస్: చీమకుర్తి మండలం గోనుగుంట గ్రామంలోని హైస్కూల్ నందు జీఎస్టీ (గూడ్స్. సర్వీసెస్. టాక్స్) పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. పోటీలలో ప్రథమ బహుమతి దర్శి అను (10వ తరగతి), ధ్వితియ బహుమతి టీ. పవన్ కళ్యాణ్, తృతీయ బహుమతి వినయ్‌లు బహుమాతులు పొందిన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ యం. శ్యాంకుమార్, సచివాలయం వెల్ఫేర్ బి.కోటేశ్వరరావు మరియు ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ధర్నాలో ఏపిటీఎఫ్ నాయకులు



సి.యస్.పురం, మేజర్‌న్యూస్: మంగళవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో అధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మండల ఏపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడమేగాని పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నట్లు పెండింగులో ఉన్న బకాయిలు చెల్లింపు డిఏ ప్రకటన సిపియస్ రద్దు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టినట్లు విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ఏపీటీఎఫ్ నాయకులు షేక్ నాయబ్ రసూల్, కె.చెన్నయ్య, యస్.వహీద్, జి.రామకృష్ణ, సయ్యద్ ఖాజారంతుల్లా, బి.చిననారాయణ, చాంద్ బాషా, డి.శ్రీనివాసులు, ఇండ్ల ప్రసాద్, సుబ్బారావు, అహ్మద్, డి.సుబ్బారాయుడు, జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అవార్డు గ్రహీత తహసీల్దార్‌ను సన్మానించిన జర్నలిస్టులు



పొదిలి, మేజర్‌న్యూస్: ఒంగోలు రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజబాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ చేతులు మీదుగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర అవార్డు తీసుకున్న తహసిల్దార్ ఎంవి.కృష్ణారెడ్డిని మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జర్నలిస్టులు షేక్ బాజీ, చప్పిడి శ్రీనివాసులు, మోరా శ్రీనివాసరెడ్డి, వడ్డే వేణు, ముల్లా బడే, నర్రా వెంకటేశ్వర్ రెడ్డి, రామారావు, పింగళి భానుచందర్, కోవూరి శ్రీనివాసులు, అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

## స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ జట్లు ఎంపిక



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించి క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు టీ.రవికుమార్, డి.శ్రీనివాసరావు తెలిపారు ఎంపికైన క్రీడాకారులు త్వరలో వివిధ జిల్లాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని ప్రకాశం జిల్లా అండర్-19 ఎస్‌జిఎఫ్ సెక్రటరీ చింపారెడ్డి తెలిపారు. ఈ ఎంపికలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు గ్రామ పంచాయతీ సెక్రెటరీ పి.రవికుమార్, డైట్ ఇంచార్జ్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు హనుమచారి, పిడిలు వనజ, కౌసల్య, సౌజన్య, కోటిరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి ఉత్సవాలు

సంతమాగులూరు మేజర్‌న్యూస్: స్థానిక సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం రామాయణం రచించిన వాల్మీకి జయంతి ఉత్సవాలను గ్రంథ పాలకులు విజయభాస్కర్ రెడ్డి గ్రామ పెద్దలతో ఘనంగా నిర్వహించారు అన్నదమ్ముల ఆప్యాయత తల్లిదండ్రుల పట్ల బాధ్యత ఎలా ఉండాలో రామాయణం నేర్పిస్తుందని ఈ సందర్భంగా గ్రంథ పాలకులు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

## బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్లు జైలు

### మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం

### కోర్టులలో నిందితులకు శిక్షలు పడినప్పుడే బాధితులకు సరైన న్యాయం: జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



సూర్యప్రతినిధి బాపట్ల: మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ హెచ్చరించారు. 2021 సంవత్సరం జనవరి 1న బాపట్ల జిల్లా మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2 సంవత్సరాలు వయసు గల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి గురజాల మహేష్ 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.12 వేలు నగదు జరిమానా విధిస్తూ ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ మంగళవారం తీర్పు వెలువరించినారు. అదేవిధంగా మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం తరపున 3 లక్షల నగదు పరిహారం చెల్లించే విధంగా ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మైనర్ బాలికలపై, మహిళల మీద నేరం జరిగితే వేగంగా దర్యాప్తు చేసి నిర్ణిత గడువులోపు సంబంధిత కోర్టలలో ఛార్జ్ షీట్ దాఖలు చేసి, కోర్టులో జరుగుతున్న విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ, సాక్షులకు తగిన రీతిలో భయం లేకుండా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వడం వలనే కేసులలో నిందితులకు శిక్షలు పడుతున్నాయన్నారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేసి, ముద్దాయిని అరెస్ట్ చేసి, భౌతిక సాక్ష్యాధారాలతో కోర్టు వారికి సమర్పించి, ప్రత్యేక ఫోక్సో కోర్ట్ లో వేగవంతంగా ట్రయిల్ జరిగే విధంగా పర్యవేక్షించుకుంటూ ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది మరియు పీపీకి జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

## టెన్త్‌పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించిన కాసు



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: మండలంలోని మర్రిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు 2025 మార్చి లో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రముఖ ఎన్నారై కాసు వెంకటేశ్వరరెడ్డి కాసు చారిటబుల్ ట్రస్టు ద్వారా నగదు బహుమతి అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమం లో మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి మామిల్లపల్లి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథగా హాజరై 600 మార్కులకు 550 మార్కులు సాధించిన కె సాయిప్రియకు మొదటి బహుమతిగా రూ. 10 వేలు, 600 మార్కులకు 528 మార్కులు సాధించిన ఎన్. దీప్తికి రెండవ బహుమతిగా రూ.7500లు, 600 మార్కులకు 518 మార్కులు సాధించిన %ఖ%. శ్వేతకు మూడవ బహుమతిగా రూ.5000 ల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసు వెంకటేశ్వరరెడ్డి దాతృత్వం మరువ లేనిదన్నారు. దాతలు ఇటువంటి బహుమతులు ఇవ్వడం వల్ల విద్యార్థులలో పోటీ తత్వం పెరుగుతుందని చెప్పారు .పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాసు వెంకటేశ్వరరెడ్డి అభినందనీయులు అని వారికి పాఠశాల తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్వతీపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సానికొమ్ము.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాసు వెంకటేశ్వరరెడ్డి పొదిలి ,కొనకనమిట్ల మండలాలలో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరును కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి, మేజర్‌న్యూస్: 8వ తేది బుధవారం చీమకుర్తి పట్టణంలో జరుగుతున్న ఆర్.డి.ఎస్.ఎస్, లైన్ మరమత్తులు దృష్ట్యా చీమకుర్తి పట్టణములో యున్న గృహ, గృహేతర, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఉదయము 9.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అంతరాయం కలుగుతుంది. కావున వినియోగదా రులు సహకరించాలని విద్యుత్ శాఖ, చీమకుర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం: ఎమ్మెల్యే ఉగ్ర





కనిగిరి, మేజర్‌న్యూస్: మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలోని కౌన్సిల్ హాలు నందు మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని మౌలిక వసతులైన నీరు, విద్యుత్ సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మురుగు కాలువలను శుభ్రం చేసి దోమల నియంత్రణ కొరకు ఫాగింగ్ చేయాలని లేని యెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సి, ఎస్టి స్మశాన వాటికల నిర్మాణాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవాలన్నారు. రానున్న మునిసిపల్ ఎన్నికల దృష్ట్యా కనిగిరి పురపాలక సంఘం పరిధిలో 20 వార్డులను డీలిమిటేషన్ ఆఫ్ ఎలక్షన్ వార్డుల ప్రకారం ప్రభుత్వ ఆదేశానుసారం 28 వార్డులుగా ప్రతిపాదించడం జరిగినదని టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సువర్ణ కుమార్ ప్రొజక్టర్ ద్వారా హద్దులను వివరించారు. మునిసిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని సమస్యలను కౌన్సిలర్లు, అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులను త్వరితగతిన పూర్తి చేసి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి వారితో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కనిగిరి మునిసిపల్ సమావేశంలో 62 అంశాలను మునిసిపల్ పాలక సిబ్బంది ఆమోదం తెలిపారు. కనిగిరి మునిసిపల్ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కనిగిరి పురపాలకసంఘంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డు పొందిన సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కమీషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, టిపిఎస్ సువర్ణ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కల్తీ మద్యం దొంగలను పట్టుకుంది కూటమి ప్రభుత్వమే: అనగాని

రేపల్లె, మేజర్‌న్యూస్: కల్తీ మద్యం తయారు చేసే దొంగల ముఠాను పట్టుకుంది మా కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు కల్తీ మద్యం స్థావరాలపై దాడి చేయడం జరిగిందని తెలిపారు. కల్తీ మద్యం మూలాలు మొత్తం తాడేపల్లి ప్యాలెస్ చుట్టే ఉన్నాయన్న సంగతి వైసీపీ నేతలు గుర్తించుకోవాలని హితవు పలికారు.ఎవరికో పుట్టిన బిడ్డకు పేరు పెట్టుకోవడం జగన్ కి అలవాటేనని ఎద్దేవా చేశారు. కల్తీ మద్యం గుట్టు మేము విప్పితే అమెరికాను కొలంబస్ కనిపెట్టినట్లు కల్తీ మద్యాన్ని జగనే కనిపెట్టి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ హయాంలో జరిగిన కొండంత మద్యం స్కాంని తప్పు దారి పట్టించడానికి గోరంత విషయాన్ని కొండంత చేసి మాట్లాడుతున్నారని విమర్శించారు.గత ఐదు సంవత్సరాలలో జే బ్రాండ్ కల్తీ మద్యంతో ముప్పై వేల మంది ఆడబిడ్డల తాళి బొట్టులు తెంచిన మద్యమూకాశురుడైన జగన్ రెడ్డి కల్తీ మద్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జంగారెడ్డిగూడెంలో 27 మంది కల్తీ సారా తాగి చనిపోతే అసెంబ్లీ సాక్షిగా అవి సాధారణ మరణాలని జగన్ రెడ్డి చెప్పింది గుర్తులేదా అని ప్రశ్నించారు. కల్తీ సారా తాగి చనిపోయిన వారిని హేళన చేసి మాట్లాడిన వైసిపి నాయకులు నేడు కల్తీ మద్యం గురించి మాట్లాడటం నిజంగా సిగ్గుచేటు అన్నారు. కల్తీ లిక్కర్ మాఫియాతో సంబంధం ఉన్న ఏ పార్టీ వారైనా వదిలేది లేదని రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని పూర్తిగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉందని మంత్రి అనగాని తెలిపారు.



## త్రిపురాంతకేశ్వరుని ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేసిన భక్తులు

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: ప్రపంచంలోనే శిలా శ్రీ చక్రం పైన రాక్షసభక్తులు నిర్మించిన ఏకైక శివాలయం త్రిపురాంతకం శివాలయం ఈ శివాలయం చుట్టూ పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ చేస్తే అరుణాచలంలో మూడు ప్రదక్షిణలు చేసినంత పుణ్యమని పురాణ గాథలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే త్రిపురాంతకంలోని శివ భక్తులు పౌర్ణమి రోజున అధిక సంఖ్యలో భక్తులు వచ్చి భక్తి శ్రద్ధలతో శివ శివ హర హర మహాదేవ అంటూ శివనామ స్మరణ చేస్తూ త్రిపురాంతకం క్షేత్రంలో స్వామివారి కొండ చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేస్తూ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అంటూ శివనామస్మరణతో మారు మృగ్య విధంగా గిరిప్రదక్షిణ జరిగింది. ఈ గిరిప్రదక్షిణలో శివాలయ ప్రధాన అర్చకులు ధూపాటి విశ్వం నారాయణ శర్మ స్వామి వారి చరిత్ర చెబుతూ అందరినీ కలుపుకొని గిరిప్రదక్షిణ చేశారు.



## వైసిపిని రాష్ట్రం నుంచి బాయికాట్ చేయాలి: ఎమ్మెల్యే



వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి డైరెక్షన్లు చేస్తున్నారన్నారు.అంబేద్కర్ విగ్రహాన్ని వైసీపీనే ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నం.చేయటం కృరత్వమన్నారు.క్రూరత్వం తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్ లో ఉన్నారని,అంబేద్కర్ విగ్రహాన్ని నాశనం చేసిన వైసీపీ నేతలను సభ్యసమాజం నుంచి వెలివేయాలన్నారు.రాజ్యాంగం అన్నా,ప్రజాస్వామ్యం అన్నా లెక్కే చేయని క్రూర స్వభావి జగన్ రెడ్డి అని ఆనందబాబు విమర్శించారు.రాష్ట్రంలో ఉండటానికి జగన్ రెడ్డి అర్హుడు కాదన్నారు.విగ్రహ ధ్వంసం కేసులో వైసీపీ నేతలు పట్టుబడి జైలుకు వెళ్లినా జగన్ మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ఆయన అన్నారు.దళితులంటే జగన్ రెడ్డి కి ఎందుకు అంత చిన్న చూపో అర్థం కావడం లేదన్నారు.దళితుడైన సింగయ్యపై జగన్ రెడ్డినే స్వయంగా కారు ఎక్కించి తొక్కించి చంపేశాడనీ ఆనంద బాబు గుర్తు చేశారు. ఇంకా ఎంత కాలం దళితుల పేరు చెప్పి కుట్ర రాజకీయాలు చేస్తావ్ జగన్‌రెడ్డి?ఎన్ని కుట్రలు చేసినా,ఎన్ని విధ్వంసాలు చేయాలని ప్రయత్నించినా తిప్పికొడతామని ఆనందబాబు హెచ్చరించారు.



## వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం: కలెక్టర్

సూర్య ప్రతినిధి బాపట్ల, మేజర్‌న్యూస్: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని అధికారులంతా జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శ్రీ మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసే మంచి అవకాశం మనకే దక్కిందని కలెక్టర్ చెప్పారు. ప్రతిరోజు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అధికారులంతా ఒక కుటుంబముగా భావించి మెలగాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలోనూ అధికారులు కలిసి పనిచేయాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులు, జిల్లాలోని ఉద్యోగులను సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతోనే ముందుకు సాగగలమన్నారు. ప్రపంచంలోనే మహా భారతం, రామాయణం, కురాన్, బైబిల్ మహా గొప్ప గ్రంథాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి శివలీల, వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, బిసి సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రసన్నాంజనేయునికి లక్ష తమలపాకుల పూజ



అద్దంకి, మేజర్‌న్యూస్: మండలంలోని శింగరకొండ క్షేత్రములో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి వారికి రేవతి నక్షత్రం మంగళవారము ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ జరిపారు. తదుపరి వేదపండితులు అర్చకులు ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి వార్లకు జీవధ్వజస్థంభమునకు నారికేళఫల సమర్పణ జరిగింది. తదనంతరం 11 ఆవృత్తములుగా దేవస్థానం వేదపండితులు అర్చకులు లక్ష తమలపాకుల పూజ కార్యక్రమము నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారికి మహానివేదన పంచహారతులు కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా వలపర్ల వాస్తవ్యులు తవ్వా సురేష్ బాబు వెంకట లక్ష్మీ పద్మావతి దంపతులు పాల్గొన్నారు. పూజ అనంతరం దేవస్థానం వేదపండితుల అర్చకులు ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూర్ణిమ మంగళవారము కలిసిరావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ తిమ్మా నాయుడు, పాలక మండలి చైర్మన్ చుండూరి మురళి సుధాకర్ రావు నేతృపంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## మానవాళికి మార్గదర్శకులు వాల్మీకి: గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: మూల రామాయణ రచయిత సర్వ ప్రజానీకానికి మార్గదర్శకుడు మహర్షి వాల్మీకి అని దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సకల జనులకు శుభాకాంక్షలును డాక్టర్ లక్ష్మి తెలిపారు. జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పరిస్థితుల ప్రభావం కారణంగా కిరాతకుడిగా వ్యవహరించినా తపస్సుతో మహనీయుడుగా మారి ప్రపంచానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి వాల్మీకి అని అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉం టుంది. ఆచంద్రతారార్కం నిలబడిపోయే మహర్షి వాల్మీకి కీర్తిప్రతిష్టల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతమని డాక్టర్ లక్ష్మి తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ముమ్మనేనిని పరామర్శించిన ఎమ్మెల్యే



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన మాజీ శాసన సభ్యులు,గుంటూరు జిల్లా కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతూ,ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం చెరుకుపల్లి సమీపంలోని నడింపల్లి గ్రామంలోని తమ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఏమ్మెల్యే ఆనందబాబు స్వయంగా వెంకటసుబ్బయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆనంద బాబు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ముమ్మనేనితో పాటు మల్లిపెద్ది గనయ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేడు ఏఎంసి కుర్చీపై 'చిట్టెం'

ఒంగోలు, మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల కోలాహాలం జోరుగా కొనసాగుతోంది. కష్టకాలంలో పార్టీల కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలను ఎవ్వరి స్థాయిలో వారికి ఆయా పార్టీలు తగిన గుర్తింపును ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీలో టిడిపితో పాటు జనసేనకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రకాశం జనసేన జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్‌కు ఏఎంసి వైస్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు. నేడు ఒంగోలులోని ఏ1 కన్వేన్షన్ హాల్లో అట్టహాసంగా ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరగనుంది. ఏఎంసి వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయబోతున్న చిట్టెం ప్రసాద్ రాజకీయ జీవిత నేపథ్యంపై 'సూర్య' స్పెషల్ ఫోకస్...



## రాజకీయ నేపథ్యం

చిట్టెం వెంకట దుర్గాప్రసాద్ ఒంగోలులోని నిర్మల్ నివాసి.



డిగ్రీ వరకు ఒంగోలులోని చదివారు. విద్యార్థి దశ నుండే ఉద్యమాలపై ఆసక్తి కనబర్చేవారు. చిట్టెం ప్రసాద్ 2007 సంవత్సరంలో కాంగ్రెస్‌లోకి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్‌లో ఎంతో ఉత్సాహంగా ఉండే యువ నేతగా పేరొందారు. ఈ క్రమంలో అది కొద్ది సమయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ పదవి వరించింది. దీంతో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ ముందుకు సాగుతూ పార్టీ పెద్దల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అనంతరం 2014లో పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించిన తర్వాత చిట్టెం ప్రసాద్ జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.



## షేక్ రియాజ్‌కు వెన్నుదన్నుగా...

జనసేన పార్టీలోకి చేరిన చిట్టెం ప్రసాద్ తనదైన శైలిలో ముందుకు సాగారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ సిద్ధాంతాలకు లోబడి, పార్టీ ఆదేశాలను జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ సూచనలు, సలహాలతో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి షేక్ రియాజ్ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. ఆ ఎన్నికల్లో ఒంగోలులో జనసేన తన పాత్ర గట్టిగానే పోషించింది. అనంతరం 2020లో షేక్ రియాజ్ సిఫారస్సుతో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చిట్టెం ప్రసాద్‌ను ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ పదవిలో కొనసాగుతున్నారు.

## పార్టీలో క్రమశిక్షణకు కేరాఫ్

ప్రకాశం జనసేన పార్టీలో క్రమ శిక్షణకు కేరాఫ్‌గా చిట్టెం ప్రసాద్ నిలిచారని చెప్పవచ్చు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా అందరివానిగా చిట్టెం పేరు సంపాదించుకున్నారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను కూడా సున్నితంగా విమర్శించేవారు. ఏలాంటి సమయంలో కూడా పార్టీ గీచిన లైన్ దాటలేదు. జిల్లా అధ్యక్షులు రియాజ్ వెంటే నడుస్తూ ఆత్మీయతతో యువతను ప్రోత్సహిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు.

## వీర మహిళలకు పెద్దన్న

జనసేన పార్టీలో వీర మహిళలకు ప్రముఖ స్థానం ఉంటుంది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వారిని ఎంతో గౌరవంగా చూస్తారు. అదే విధంగా క్రింద స్థాయిలో కూడా వీర మహిళలకు అలాంటి గౌరవమే వారికి అందాలని అనేక సందర్భాలు నేతలకు సూచిస్తుంటారు. పవన్ కల్యాణ్ సూచినను తూచా తప్పకుండా ప్రకాశం జనసేన వీర మహిళల్లో చిట్టెం ప్రసాద్ ప్రత్యేక స్థానాన్ని పొందారు. ప్రతీ ఒక్క వీర మహిళ ఆప్యాయంగా పెద్దన్నగా చిట్టెంను పిలుచుకుంటారు.

## నేడు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా చిట్టెం ప్రసాద్ ప్రమాణ స్వీకారం

ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా జనసేన జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నగర పరిధిలోని ఏ1 కన్వేన్షన్ హాల్లో బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకార వేడుక జరగనుంది. టిడిపి, జనసేన, బిజేపి శ్రేణులు భారీ సంఖ్యలో ఏఎంసి పాలక మండలి ప్రమాణ స్వీకారానికి తరలిరానున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ కు మొదటి నుండి చిట్టెం ప్రసాద్ వెన్నుదన్నుగా నిలిచారు. చిట్టెం ప్రసాద్ కష్టపడే తత్వాన్ని గుర్తించిన జనసేన అధిష్టానం ఏఎంసి వైస్ ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవి కేటాయించింది. జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సూచనతో ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ సిఫారస్సుతో జనసేన అధినేత, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఆశీస్సులతో నేడు చిట్టెం ప్రసాద్ ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.







- ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ వైస్ ఛైర్మన్‌గా చిట్టెం ప్రసాద్ నేడు ప్రమాణ స్వీకారం
- కూటమి ప్రభుత్వంలో చిట్టెంకు దక్కిన గౌరవం
- ప్రకాశం జనసేనలో క్రమశిక్షణకు కేరాఫ్
- జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కు వెన్నుదన్నుగా రాజకీయ ప్రయాణం
- వీర మహిళలకు పెద్దన్నగా క్యాడర్‌ను సమన్వయంతో చేసుకుంటూ పార్టీ బలోపేతం
- నేడు ఏఎంసి ప్రమాణ స్వీకారానికి ముస్తాబైన ఏ1 కన్వెన్షన్ హాలు
- ఒంగోలులో భారీ బైక్ ర్యాలీ, తరలిరానున్న కూటమి శ్రేణులు

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

**రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య అధికారులకు ఆదేశం**



ఒంగోలు, మేజర్‌న్యూస్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్పర్సన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఒకవైపు దీని వినియోగాన్ని నివారించి, మరోవైపు ఇప్పటికే ఉన్న వ్యర్థాలను రీసైకిల్, రీయూజ్ చేయటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన కాలుష్య నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనములో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులతో వివిధ అంశాలపై కృష్ణయ్య చర్చించారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ముఖ్యంగా ప్రకాశం వంటి జిల్లాలలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదే సమయంలో కాలుష్యాన్ని కూడా తగ్గించడంపై దృష్టి సారించాల్సిన అవసరం సంబంధిత శాఖలపై ఉందన్నారు. గ్రానైట్ వ్యర్థాల కోసం నిర్దిష్ట స్థలం గుర్తింపు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఒంగోలులో నిర్మించేందుకు అవసరమైన స్థలం కేటాయింపుపైనా కృష్ణయ్య చర్చించారు. ఈ సమావేశంలో డిపిఓ వెంకటేశ్వరరావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ. రాఘవరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డిఓ కళావతి, జిల్లా వ్యవసాయ అధికారి (ఇంచార్జ్) రజనీకుమారి, డీఎస్ఓ పద్మశ్రీ, ఏపీ ఎం.ఐ.పీ. పీ.డీ. శ్రీనివాసులు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ గోపీచంద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, అన్ని మునిసిపాలిటీలు, అటవీ, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.



## సిఎం చంద్రబాబు చేతులమీదగా ఆర్.ఎల్.పురం పంచాయతీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

చీమకుర్తి, మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా చీమకుర్తి మండలంలోని ఆర్.ఎల్.పురం పంచాయతీ సర్పంచ్ పి. రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి జి.నరేంద్ర ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ గ్రామపంచాయతీ రాష్ట్ర అవార్డు-2025ను అందుకున్నారు. ఈ అవార్డు స్వచ్ఛభారత్ మిషన్ పరిధిలో ఆర్. ఎల్. పురం గ్రామపంచాయతీ అందించిన అద్భుత సేవలు పరిశుభ్రత వ్యర్థ నిర్వహణ మరియు ప్రజల భాగస్వామ్యం ను గుర్తిస్తూ ప్రభుత్వం రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర-2025 రావడం జరిగిందని సర్పంచ్ పి రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి జి నరేంద్ర తెలిపారు.

# ప్రభుత్వ సేవలుపై ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేయాలి

**కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పటిష్టంగా చేపట్టాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో సిసిఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మీ ఆదేశం**





ఒంగోలు, మేజర్‌న్యూస్ : రెవెన్యూ అంశాల ప్రజా సేవల పనితీరు పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం అన్నదాత సుఖీభవ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, కాస్ట్ సుమోటో డ్రైవ్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ అంశాల ప్రజా సేవల పనితీరు పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణం గా రాజముద్రతో తయారు చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మాదకద్రవ్యాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు

**-పొదిలిలో ఆకస్మిక తనిఖీలు-**



పొదిలి, మేజర్ న్యూస్: గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో, ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం పొదిలిలోని కీలక ప్రాంతాలలో పొదిలి సి ఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన లు పోలీసులతో కలిసి ఆకస్మిక, విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా గంజాయి కేసుల్లో గతంలో నిందితులుగా ఉన్నవారి ఇళ్లతో సహా రద్దీ ప్రాంతాలలో తనిఖీ చేశారు. తనిఖీలలో డాగ్ స్క్వాడ్ గంజాయి మరియు మాదకద్రవ్యాలను గుర్తించడంలో శిక్షణ పొందిన రాక్సీ జాగిలాంతో పాటు పోలీసులు తనిఖీ నిర్వహించారు. పొదిలి ఆర్టీసీ బస్టాండ్ పార్సిల్ పాయింట్, బెస్తపాలెం ఏరియాలో గతంలో గంజాయి కేసుల్లో నిందితులగా ఉన్న వారి ఇళ్లను సీఐ, ఎస్సైలు సిబ్బంది రాక్సీతో కలిసి తనిఖీ చేశారు.

## డొంక పోరంబోకు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని ఏండ్లూరు డొంక పరిధిలో గల సర్వే నంబర్ 393లో డొంక పోరంబోకు భూమిని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ దారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజా బాబుకు పేర్నమిట్ట కు చెందిన మందా శేఖర్ బాబు వినతిపత్రాన్ని అందజేశారు. ఏండ్లూర్ డొంక పరిధిలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో డొంక పోరంబోకు భూమిని సదరు రియల్ ఎస్టేట్ దారుడు దర్జాగా ఆక్రమించుననను నేటి వరకు చర్యలు చేపట్టలేదని శేఖర్‌బాబు తదితరులు కలెక్టర్కు విన్నవించారు. ఇకనైనా డొంక పోరంబోకు భూమికి సర్వే నిర్వహించి ఆక్రమణ ను నివారించాలని వారు కోరారు.

# అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా అంతరిక్ష నడక (స్పేస్ వాక్)

**క్విస్ విద్యాసంస్థలు, ఇస్రో సంయుక్త నిర్వహణ**

**ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసరావు**

**కార్యక్రమంలో క్విస్ స్కూల్, కళాశాల, నవోదయ విద్యార్థులు**





ఒంగోలు, మేజర్‌న్యూస్: సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), ఇస్రో, ఒంగోలు క్విస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులో అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం అంతరిక్ష నడక (స్పేస్ వాక్)ను నిర్వహించినట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ఒంగోలులోని ఎస్పీ ఆఫీస్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. క్విస్ కళాశాల విద్యార్థులు, స్కూల్ విద్యార్థులు, నవోదయ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని భారత్ మాతాకీజై, ఇస్రో గొప్పదనం గురించి, అంతరిక్ష పరిశోధనల గురించి నినాదాలు చేశారు. ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ఊరేగించారు. అనంతరం మాట్లాడిన డీఎస్పీ శ్రీనివాసరావు ... అంతరిక్ష పరిశోధనలు, రాకెట్లు వాటి పనితీరు ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన, అంతరిక్షప్రయోగాలు, ప్రయోజనాలు తెలియజేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం మాట్లాడిన షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ... విద్యార్థులతో పాటు సామాన్య ప్రజానికానికి అంతరిక్షం, అంతరిక్ష పరిశోధనలు, వాటి వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో స్పేస్ వాక్ నిర్వహించినట్లు చెప్పారు. క్విస్ కళాశాల దానికి వేదిక అయ్యిందని, ఈ సందర్భంగా క్విస్ కళాశాల యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగా ఉపయోగపడుతున్నాయి. అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా షార్ ఇలాంటి కార్యక్రమం చేయడం అందరికీ చాలా ఉపయోగకరమని, ముఖ్యంగా విద్యార్థులకు రాకెట్ పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుక ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి క్విస్ ఇంజనీరింగ్ కళాశాల వేదిక అవ్వడం గర్వ కారణంగా ఉందని అన్నారు. క్విస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్య్రమం నిర్వహించడం ఇది రెండో సారని, మళ్లీ మళ్లీ ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా, గర్వంగా కూడా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ర్యాలీలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్ట్ స్పేస్ వీక్ - 2025 ఒంగోల్ సబ్ కమిటీ ఛైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్యఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, క్విస్ కళాశాల, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రారంభోత్సవానికి షార్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్**

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా 8వ తారీఖు బుధవారం క్విస్ కళాశాలలో జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈఎస్ పద్మకుమార్, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 8వ తేదీన 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు అంతరిక్షం అంశంపై డ్రాయింగ్ పోటీలు, 9వ తేదీన 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీ నిర్వహించనున్నారు. దాంతో పాటుగా 8, 9 తేదీల్లో కళాశాల విద్యార్థులకు టెక్నికల్ ఎక్స్ పో నిర్వహించనున్నారు. వీటితో పాటుగా విద్యార్థులకు అంతరిక్షం, అక్కడి పరిస్థితులు, శాటిలైట్లు, ఇస్రో లాంచ్ వెహికల్స్ తదితర అంశాల గురించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

# సిజెఐపై దాడికి నిరసనగా న్యాయవాదుల నిరసన




రేపల్లె, మేజర్‌న్యూస్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ సీజేఐ గవాయిపై న్యాయవాది రాకేష్ అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ మంగళవారం రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదుల విధులు బహిష్కరించి తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం అయినా సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ బెంచ్ వద్ద ఒక కేసులో వాదనలు జరుగుతున్నటువంటి సమయంలో సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి పై కోర్టు హాల్లో బిగ్గరగా కేకలు వేస్తూ చెప్పు విసరడానికి చేసినటువంటి అప్రాజస్వామిక విధానాన్ని రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడం అంటే రాజ్యాంగం పైన దాడి చేయడమేనని బాధ్యతాయుతమైనటువంటి పదవిలో కొనసాగుతున్నటువంటి వ్యక్తిపై ఒక న్యాయవాది దురుద్దేశంతో వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇటువంటి సంఘటనలు సభ్య సమాజానికి మాయని మచ్చగా మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ ను న్యాయవాద వృత్తి నుండి శాశ్వత బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తులు న్యాయవాదులు బార్ అండ్ బెంచ్ రిలేషన్స్ ను నిబంధనలకు అనుగుణంగా పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి, రేపల్లె బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు, మాజీ ప్రభుత్వ సహాయ న్యాయవాదులు దారం సాంబశివరావు, కర్రా ఐజాక్ న్యాయవాదులు గుంటూరు విజయ కుమారి, కట్టుపల్లి కాకమ్మ, ఎం వెంకటేశ్వరరావు గుడిపల్లి రవి గురిందపల్లి రామారావు నాలాది పోతురాజు రేవు నాగరాజు గుమ్మడి కుమార్ బాబు మునిపల్లి సుబ్బయ్య కర్రా జయరావు నల్లూరి వెంకటేశ్వర రావు దోవా రమేష్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.



## జిఎస్టీ తగ్గింపు మధ్యతరగతికి ఎంతో మేలు

నగరం, మేజర్‌న్యూస్: జీఎస్టీ రేట్లు తగ్గించటం, మరి కొన్నింటిని పూర్తిగా తొలగించటంతో చదువుకునే పిల్లల వస్తువుల రేట్లు గణనీయంగా తగ్గాయని స్థానిక ఎంపీడీఓ బి. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నగరం బాలయేసు ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులకు జిఎస్టీపై అవగాహన కల్పించేదానిలో భాగంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వాడుకునే వస్తువుల రేట్లు తగ్గింపుతో మధ్య, ఎగువ తరగతి వారికి ఎంతో మేలు చేకూరుతుందని, ఫలితంగా డబ్బు ఆదా అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కోటేశ్వరరావు, వీరాంజనేయులు, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సూనా, ప్రిన్సిపల్ సిస్టర్ సజీవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## వీరజవాన్‌కు కృష్ణకిషోర్ ఘన నివాళి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలోని కృష్ణంశెట్టిపల్లె గ్రామానికి చెందిన దాసరి చిన్న తిరుమలయ్య (జి.ఆర్.ఇ.ఎఫ్) ఆర్మీలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారి భౌతికాయాన్ని స్వగ్రామానికి చేర్చి మంగళవారం అధికార లాంఛనాలతో అంత క్రియలు నిర్వహించగా కృష్ణ కిషోర్ రెడ్డి జవాన్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వారితో పాటు మండల తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, పాలుగుళ్ళ హనుమంతారెడ్డి, చిన్న శ్రీనివాసరెడ్డి, ఆర్మీ జవానులు, పోలీస్ సిబ్బంది నివాళుల ర్పించారు.

## పక్కా గృహాలు నిర్మించి ఎస్టీలను ప్రభుత్వం ఆదుకోవాలి



సూర్య ప్రతినిధి బాపట్ల, మేజర్‌న్యూస్: కాల్వకట్టలపై పోరంబోకు స్థలాల్లో పూరి గుడిసెల్లో నివసిస్తున్న గిరిజన యానాదుటకు పక్కా గృహాలు నిర్మించి ఉపాధి కల్పించాలని కోరుతూ జాతీయ గిరిజన ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ రామ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనాదిగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన యానాదులు నియోజకవర్గంలో పిట్టలవాని పాలెం, చందోలు, అల్లూరు, అలకాపురం, వెదుళ్ళపల్లి, కొండుబోట్లపాలెం, కర్లపాలెం వంటి ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలో పలుచోట్ల యానాదులు పాచి పనులు, చేపల వేట, ఎలుకలు పట్టడం వంటి పనులతో పూటగడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సరైన నివాస గృహాలు లేవని, నివేశన స్థలాలు, రక్షిత మంచినీరు, కొందరికి ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేవని, ఉపాధి హామీ జాబ్ కార్డులు లేవని తెలిపారు. వీళ్ళల్లో గర్భిణి స్త్రీలు, పసి పిల్లలు, వృద్ధులుతీవ్ర పౌష్టికాహారం లోపంతో ఉన్నారని తెలిపారు. వీరికి అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆశా కార్యకర్త అనుబంధంగా నియమించాలని అన్నారు. చదువుకున్న వారికి సైతం సరైన ఉపాధి లేకపోవడంతో తాతల కాలం నుండి యానాదులు కొనసాగిస్తున్న పనితోనే సరిపెట్టుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి అనాదిగా ఏ ప్రభుత్వ పథకాలకు నోచుకోని యానాదులకు పక్కా గృహాలు నిర్మించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యానాది సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## వరినారుకు పరీక్షలు నిర్వహించాలి: కావూరి

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: వేటపాలెం మండలం పాపాయపాలెం పంచాయతీ నాట్లు వేసిన పంట పొలాలను చీరాల వైయస్సార్ రైతు విభాగ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ నెల రోజుల క్రితం వేసిన వరి నారు ఎండిపోవడం జరుగుతుందని అయితే దీనికి కారణం పంటకు అందించిన నీటిలోనా లేక సాగు చేస్తున్న భూమిలో లోపమా అనేది అర్థం గాక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అధిలోనే పంట నారులు దెబ్బతినడంతో రైతులు అల్లాడిపోతున్నారని చెప్పారు. వ్యవసాయ అధికారులు ఎండిపోతున్న పంటలను పరిశీలించి తగు పరీక్షలు జరిపించాలని కోరారు. కార్యక్రమంలో దేవ సహాయం, రైతులు పాల్గొన్నారు.



## జిఎస్టీపై విద్యార్థులకు అవగాహన

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల పరిషత్తు అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా, మండల విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం జిఎస్టిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రమైన వెలిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూలు, కస్తూర్బా స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, పెయింటింగ్స్‌లో అత్యు త్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా, మండల విద్యాశాఖ అధికారి దాస్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సూచించారు. సూపర్ జిఎస్టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వెలిగండ్ల పంచాయతీ పరిధిలో వినియోగదారులకు దుకాణదారులకు సూపర్ జిఎస్టి మరియు సూపర్ సేవింగ్స్‌పై పాంప్లెట్స్ పంచుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా, మండల విద్యాశాఖ అధికారి దాస్ ప్రసాద్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బుట్టి దిలీప్‌కుమార్‌కి బెస్ట్ విబిఎస్ టీచర్ అవార్డు




పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ గద్దపాటి విజయరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ మహానగరములోని రవీంద్ర భారతి ఆడిటోరియం నందు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రీస్తుసైన్యం చిల్డ్రన్ మినిస్ట్రీ వ్యవస్థాపకులు బుట్టి దిలీప్ కుమార్ వేసవి సెలవులలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో అనేక ప్రాంతములలో చిన్నారుల మధ్యలో ఆటలు, పాటలు నేర్పించి వారిని ఆధ్యాత్మికంగా, మానసికంగా చైతన్యవంతులుగా మారుస్తూ, సామాజిక సేవా పరిచర్య చేయుటనుబట్టి ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ గద్దపాటి విజయరాజు బెస్ట్ విబియస్ టీచర్ అవార్డుతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమీషన్ వైస్ ఛైర్మన్ శంకర్ లూక, అంతర్జాతీయ సువార్తికురాలు టీసీఫ్ ఛైర్మన్ డాక్టర్ వైయస్ విమలా రెడ్డి పాల్గొని అవార్డులు పొందిన వారిని ఉద్దేశించి ప్రత్యేకమైన సందేశం అందించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## శ్రీనారాయణస్వామి ఆదాయం రూ.1,90,941లు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం 1,90,941 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. వీటిలో పూజా టికెట్లు విక్రయం ద్వారా 82,210 లడ్డుప్రసాదాలు అమ్మకం ద్వారా 37,960 శాశ్వత అన్నదాన పథకానికి 53,739 స్వామి వారి పంచామృత అభిషేకం పూజలకు 11,032 స్వామి వారి శ్రీపాదకానుకలు జమ 6000 కలిపి మొత్తం 1,90, 941 వచ్చినట్లు ఇఓ తెలిపారు. శాశ్వత అన్నదాన పథకానికి వెలిగండ్ల మండలం నాగిరెడ్డిపల్లె వాస్తవ్యులు కదిరి వెంకటసాయితేజ తండ్రి ప్రసాద్ కుటుంబభ్యులు 10,016 రూపాయలు అందజేసినట్లు ఇఓ తెలిపారు.



## ప్రజా సంక్షేమం నినాదాలతో పనిచేసిన వ్యక్తి శంకరన్

సూర్య ప్రతినిధి బాపట్ల, మేజర్‌న్యూస్: సుపరిపాలన, ప్రజా సంక్షేమం కొరకు నిరంతరం పనిచేసిన మంచి ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఎస్ ఆర్ శంకరన్ వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టరేట్ ఆవరణలోని ఎస్.ఆర్.శంకరన్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పుష్ప మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఎస్ ఆర్ శంకరన్ జీవితంపై ఫుడ్ సైన్స్ కళాశాలలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు జీవి, మానం అప్పారావు, కరణం రవీంద్ర, బందా బాబు, ఫుడ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వినోద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన చింతలచెరువు



కనిగిరి, మేజర్‌న్యూస్: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో వైకాపా సెంట్రల్ కమిటి సభ్యులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనను సిఈసి కమిటి సభ్యులుగా నియమించడం పట్ల పుష్ప గుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# 25లోపు ఈ-పంట బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి: జెసి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లాలో ఈ పంట బుకింగ్ ప్రక్రియను ఈనెల 25 నాటికి పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లతో వర్చువల్‌గా సమావేశమై ఈ పంట బుకింగ్, సిసిఆర్సి కార్డుల జారీ, మ్యుటేషన్ కరెక్షన్ మరియు ట్రాన్సాక్షన్స్, పట్టా సబ్ డివిజన్, రెవెన్యూ సర్వీసెస్ పై ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, హౌసింగ్ ఫర్ ఆల్‌లో భాగంగా ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్, ఇంటిపట్టాల కోసం దరఖాస్తుల పరిశీలన, జిఓఎంఎస్ 30 రేగులరైజేషన్, స్వామిత్వ, తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో ఈ పంట బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసారు. రెవెన్యూ సర్వీసెస్‌పై ప్రజల స్పందన సంతృప్తికరంగా ఉండేలా క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు పనిచేయాలన్నారు. జిఓఎంఎస్ 30 ప్రకారం రేగులరైజేషణ్ ప్రక్రియను కూడా పూర్తీ చేయాలని జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ పిడి మాధురి, డిఎస్ఓ పద్మశ్రీ, డిఎం సివిల్ సప్లైస్ వరలక్ష్మి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుంచి రెవెన్యు డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌కు వ్యతిరేకంగా వార్డు సభ్యురాలి రాజీనామా



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండల కేంద్రం మేజర్ పంచాయతీ గా పేరుపొందిన భట్టిప్రోలు పంచాయితీలో గత ఆరు సంవత్సరాలుగా అవినీతి రాజ్యమేలుతుందని భట్టిప్రోలు ఏడో వార్డు సభ్యురాలు కుక్కల శ్రీవల్లి వెంకటరామయ్య ఆరోపించి తన వార్డు సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపిడివో ఎస్.వెంకటరమణకు, గ్రామపంచాయతీ కార్యదర్శి మంచా నాయక్‌లకు తన రాజీనామా పత్రాలను అందించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయితీకి సంబంధించి ప్రజాధనం కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడిన వ్యక్తులు దోచుకున్నారని ఆరోపించారు. అవినీతికి ముఖ్య కారకులు గ్రామ సర్పంచ్ ధారా రవికిరణ్మయి చన్నయ్య అని ఆరోపించారు. గత ఆరేళ్ల కాలంలో ఎజెండాలో వచ్చిన అవినీతి అంశాలపై తాను అనేకమార్లు డీసెంట్ సమర్పించి ఉన్నానని తెలిపారు. ఆ విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగిందని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన దానిపై స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 నూతనంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం తన పదవికి అప్పుడే రాజీనామా చేయదలిచానని, కానీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పంచాయతీలో జరిగిన అవినీతిపై తాను పోరాటం చేసి నిగ్గు తేల్చుతానని పలుమార్లు పత్రికా ముఖంగా తెలియపరచడంతో తన రాజీనామాను విరమించుకున్నానని తెలిపారు. దీనిపై నిగ్గుతేల్చి దోషులను ప్రజల ముందు ఉంచుతారని ఆశపడ్డామని అయితే నిరాశే ఎదురైందని తెలిపారు.









# స్ట్రైట్ కట్ వద్ద ఏర్పడిన సమస్యకు పరిష్కారం చూపాలి



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: రొంపేరు కాల్వ ఈపురుపాలెం స్ట్రైట్ కట్ వద్ద ఏర్పడిన సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ని ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ ఛైర్మన్ షేక్ ఖలీఫా తుల్లా బాషా కోరారు. మంగళవారం రొంపేరు కాల్వ ఈపురుపాలెం స్ట్రైట్ కట్ సమస్యపై మత్స్యకారుల సమస్యలు తెలుసుకోవడానికి కాల్వ జల సంధి వద్దకు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ఏర్పడిన సమస్యను పారదర్శకంగా పరిష్కరించుకుంటానికి కలెక్టర్ దృష్టి సరించి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆర్డీవోలు, మత్స్య శాఖ అధికారులు, పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో వివాదాస్పద ప్రాంతాన్ని తగున్యాయం చేయాలని కోరారు. అత్యవసరమైన వాటిపై తక్షణమే అధికారులు స్పందించాలన్నారు. మత్స్యకారులకు ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే పరిస్థితులుంటే అడ్డుగా ఉన్నవి తక్షణమే తొలగించాలన్నారు. మత్స్యకారుల సమస్యలను సావధానంగా జిల్లా కలెక్టర్ పరిష్కార దిశగా కృషి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు 1972 సంవత్సరంలో కాల్వ నిర్మాణంపై సాటిలైట్ ఛాయా చిత్రాలను పరిశీలించాలనీ సంబంధిత కమిటీలోని అధికారులు ఇచ్చే నివేదికలో 1980, 1990, 2000 సంవత్సరం నాటి సాటిలైట్ ఛాయాచిత్రాలను పొందుపరచేటట్లు కమిటీలోని అధికారులు ముందస్తుగా మత్స్యకార గ్రామ పెద్దలతో చర్చించి నిబంధనల ప్రకారం సంబంధిత దస్త్రాలను పరిశీలించి తగున్యాయం చేయాలన్నారు. ఏది ఏమైనా చీరాల, బాపట్ల శాసన సభ్యులు కూడ జోక్యం చేసుకుని న్యాయం చేయాల్సిన అవసరం ఎంతనా ఉందన్నారు. పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ సభ్యులు పిన్ని సాంబశివరావు, పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బందర్ పోర్ట్ ఇంచార్జి నడకుడిటి సురేష్ బాబు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించాలని కోరుతూ మంగళవారంసంతనూతలపాడు పిహెచ్‌సి లోనూ, పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం యుపిహెచ్‌సి లోనూ అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పని ఒత్తిడి పెరిగిందని ఒత్తిడిని తగ్గించాలని, పనికి తగ్గ కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇస్తున్న జాతీయ సెలవులు, పండగ సెలవులు, వారాంతపు సెలవులు ఆశాలకు వర్తింపజేయాలని కోరారు. 2జి మొబైల్ స్థానంలో 5జి మొబైల్ సిమ్ ఇవ్వాలని, దహన సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వాలని అన్నారు. పి.హెచ్.సికి వెళ్ళిన ప్రతి సందర్భంలోనూ టి.ఏ, డి.ఏలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు యజమానులకు అనుగుణంగా మార్చుతూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు డి.మాధవి, పిచ్చమ్మ, సుజాత, సుకన్య, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని గిద్దలూరు పురపాలక సంఘ పరిధిలోని శాఖా గ్రంధాలయంలో మంగళవారం నాడు వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్ర పటమునకు పుష్పాలంకరణ గావించి ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి.రామిరెడ్డి మాట్లాడుతూ మానవతా విలువలను ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అన్నారు. గ్రంథ పాలకురాలు ఎన్.ప్రసన్న కుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్, ఎస్‌డి ఫరూఖ్, విశ్రాం త పంచాయితీ సెక్రటరీ డి.నారాయణ రెడ్డి, సాయి కృష్ణ పాఠకులు పాల్గొన్నారు.




## స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అవనీర్ గ్రానైట్

మార్టూరు, మేజర్‌న్యూస్: ఎంఎస్‌ఎంఈఎస్ 2025 జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ ఆంధ్ర ఆవార్డ్ మార్టూరు అవనీర్ గ్రానైట్ వారు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చేతుల మీదుగా అవనీర్ గ్రానైట్ యజమాని చెరుకూరి అంజిబాబు ఆ అవార్డు అందుకున్నారు. ఇంటూరి ఆంజనేయులు, ప్రత్తిపాటి సురేష్, తాటి నాగేశ్వరావు, కొర్రపాటి వేణు గోపాల్, ఎన్.శ్రీనివాసరావు, కె.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.




## జిఎస్టీపై విద్యార్థులకు అవగాహన

ఉలవపాడు, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉలవ పాడు నందు ప్రిన్సిపాల్ కే. శ్రీనివాసరావు అధ్యక్షతన జీఎస్టీపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కామర్స్ అధ్యాపకురాలు జ్యోతి జిఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.గోపీచంద్ ప్రకాష్, హనుమంతరావు, రఫీ, గంగా భవాని, సుబ్బాచారి, శ్రీనివాసులు, సుభాషిణి, మాధవరెడ్డి, మల్లిఖార్జున, వెంక టేశ్వర్లు, వల్లూరయ్య పాల్గొన్నారు.

## ద్రవరూప జీవన ఎరువులు ఎంతో మేలు



నగరం, మేజర్‌న్యూస్: జీవన ఎరువులైన పాస్ఫో బ్యాక్టీరియా ఇనాక్యులెంట్ (పిఎస్‌బి), పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా (కెఆర్‌బి) ద్రవ రూప జీవన ఎరువులు పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువుతో కలిపి మొక్క నాటిన వారం రోజుల్లోపు చల్లుకోవాలని, ఒక లీటరు ద్రవ రూప జీవన ఎరువు రెండు ఎకరాలకు ఉపయోగించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వి. రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అద్దంకివారిపాలెం రైతు సేవ కేంద్రం వద్ద గుంటూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ సంయుక్తంగా వరి పంటలో సమర్థవంతమైన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ రమేష్‌బాబు మాట్లాడుతూ పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా భూమిలోని లభ్యంకాని పొటాషియంను కరిగించి మొక్కకు అందిస్తుందని, మొక్క ఎదుగుదలకు అవసరమైన హార్మోన్ అందిస్తుందన్నారు. నానో యూరియా, నానో డిఏపీ వాడకంపై అవగాహన కల్పిస్తూ ఎకరాకు నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ సరిపోతుందని, 80% నత్రజని పంటకు అందుతుందన్నారు. పంటపై 8–10 రోజుల వరకు దీని ప్రభావం ఉంటుందని, పంటపై నేరుగా పిచికారి చేస్తున్నందున పంట మూలాలకు సులభంగా చేరుతుందన్నారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ మేనేజరు ఎస్. కిషోర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## టిటిడిపై షర్మిల విష ప్రచారం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం పై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల విష ప్రచారం చేస్తున్నప్పటికీ తిరుమల తిరుపతి దేవస్థానం ఎందుకు వహిస్తున్నదని వేల్పూరు శ్రీనివాసరావు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు లేఖ వ్రాశారు. మంగళవారం భట్టిప్రోలు విలేకరులతో మాట్లాడుతూ వైయస్ రాజశేఖర రెడ్డి కుటుంబం 20 సంవత్సరాల నుండీ తిరుమల తిరుపతి దేవస్థానం మీద విషం చిమ్ముతూ 100 కుట్రలు చేసిందని, అయినా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు షర్మిల వ్యాక్య లను ఖండించ కుండా మౌనం గా ఉండటానికి కారణం యేమిటి అని కాపు ఉద్యమనేత వేల్పురి శ్రీనివాసరావు ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానం మీద అసత్య ప్రచారం చేస్తున్న మత మార్పిడి కుటుంబానికి చెందిన షర్మిల కుట్రలు ను అడ్డుకో కుండా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ను రద్దుచేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్ కాలవ పూడికతో ఇబ్బందులు



సూర్య ప్రతినిధి బాపట్ల, మేజర్‌న్యూస్: ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్ కాలవ పూడి పోవడంతో రైతులు తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్నారని వరి, మొక్కజొన్న, మినుము పంటలను పండించుచున్న ఈ ప్రాంత సన్నచిన్న రైతులు తమ భూముల లోని మురుగునీరు, వర్షపు నీరు బయటకు పోక పంటలు దెబ్బతింటున్నాయని మంగళవారం ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్ పరిధిలోని వ్యవసాయ భూమి రైతులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ కాలవ పరిధిలో సుమారు 12 గ్రామాలు ఉండగా, అందులో దాదాపు 20 వేల ఎకరాల వ్యవసాయ భూములు, ఈ కాలవపై ఆధారపడి ఉన్నాయి. 1972లో అప్పటి ఇంజినీరింగ్ విభాగం రూపొందించిన ప్రణాళిక ప్రకారం "ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్" కాలవను నిర్మించినట్లు రైతులు తెలిపారు. ఆ సమయంలో రైతులు తమ సొంత భూముల నుంచే కాలవ కోసం భూములు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ కాలవ సముద్ర మౌత్ వద్ద పూర్తిగా పూడిపోవడంతో ప్రతి సంవత్సరం నవ ం బరు, డిసెంబర్ నెలల్లో వర్షాలు పడిన పుడు పంటలు మునిగిపోతున్నాయని తెలిపారు. 1972లో ఇంజినీర్ రూపొందించిన ప్రణాళిక ప్రకారం కాలవను స్ట్రైయిట్‌గా పూడిక తీయించి సముద్రానికి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో రైతులు చావలి వాసుదేవా హరి ప్రసాద్, నర్ర బ్రహ్మయ్య, శ్రీనివాసులు, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, వీరయ్య, తదితర రైతులు ఉన్నారు.



## మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

కనిగిరి, మేజర్‌న్యూస్: మండలంలోని తుమ్మగుంట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు (సాయిల్ హెల్త్ కార్డ్)పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఒంగోలు, ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.సుచరిత మట్టి నమూనా పరీక్షలు ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించవచ్చు, నీటి పరీక్షలు చేయించుకోవడం వలన కలిగే లాభాలను తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి ఏ.శైలజ రాణి జీవన ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అనంతరం కనిగిరి మోడల్ స్కూల్లో కళాశాల ప్రిన్సిపల్ టి.పద్మావతి ఆధ్వర్యంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు మట్టి నమూనాలు తీసే విధానం, మట్టి నమూనాలు సేకరణ ప్రాముఖ్యత వంటి విషయాలు గురించి పిల్లలకు తెలియజేసి, మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని పిల్లలు ద్వారా చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యల్.మాల్యాద్రి, సిహెచ్ రవి, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఫాసిస్ట్ లాయర్‌ను ఉపా చట్టం కింద అరెస్ట్ చేయాలి

చీరాల మేజర్, మేజర్‌న్యూస్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై సుప్రీం కోర్టులోనే న్యాయవాది బూటు విసరడం భారతదేశ రాజ్యాంగంపై జరిగిన సనాతన దాడి అని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు. మంగళవారం చీరాల దళిత మహాసభ కార్యాలయంలో అధ్యక్షులు మాచవరపు జూలియన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలం మాట్లాడారు. 71 సంవత్సరాల వృద్ధ సుప్రీం కోర్టు లాయర్ రాకేష్ కిషన్ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో చీఫ్ జస్టిస్‌పై బూటు విసిరి అవమానించారన్నారు. మధ్యప్రదేశ్ లోని ఖజురహో ఆలయ సముదాయంలో విష్ణు విగ్రహాన్ని పునరుద్ధరించాలని దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ గవాయ్ వ్యాఖ్యలపై అసంతృప్తితోనే రాకేష్ కిషన్ బూటు విసిరారని ఢిల్లీ పోలీసులు చెప్పడాన్ని నాగేంద్ర తప్పుపట్టారు. తనను నిండు కోర్టులో అవమానించినా, చీఫ్ జస్టిస్ గవాయ్ లాయర్లను విచారణ కొనసాగించమని కోరటం ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, బాపట్ల జిల్లా ఎంఎస్పీఎస్ అధ్యక్షులు తేళ్ల జయరాజు, దళిత నాయకులు కాకుమాను రవి, గొర్రెముచ్చు ఏలీయా తదితరులు పాల్గొన్నారు.



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

బాపట్ల, మేజర్‌న్యూస్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దాడి చేయడం అంటే భారత రాజ్యాంగం మీద దాడి చేసినట్లేనని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని భీమ్ ఆర్మీ బాపట్ల జిల్లా అధ్యక్షులు కొచ్చర్ల వినయ రాజు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ బాపట్ల పట్టణంలో భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవ్యవస్థను కాపాడటం మన అందరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము తోటి కిరణ్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజస్ బాబు సిపిఐ న్యూ డెమోక్రసీ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్, బీఎస్పీ బాపట్ల జిల్లా అధ్యక్షులు గుడే రాజారావు, శామ్యూల్ జాన్సన్, మోజెస్, ఏపూరి జోసఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫ్యాప్టో ధర్నాకు తరలిన యుటిఎఫ్ నాయకులు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం విజయవాడ నగరంలో ఫ్యాప్టో అధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మండలం నుండి ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నాయకులు ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 15నెలలు దాటినా ఇంతవరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఉపాధ్యాయులకు సంభందించిన పలుసమస్యలను పరిష్కరిస్తారని కోరుకుంటున్నట్లు యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యన్.వెంకటరామయ్య, జె.వెంకటరావు, పాదుషా, జి.వేమనారాయణ, కె.వెంకటేశ్వర్లు,మానం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



## విద్యార్థినులకు వ్యాయాయంపై అవగాహన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని వ్యాయాయం వలన మానసిక ప్రశాంతత ఆరోగ్యసంరక్షణ ఉంటున్నట్లు ఎంఇఓ ప్రసాదరావు అన్నారు.ఈనెల 10వతేది అంతర్జాతీయ మానసిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా వ్యాయాయంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే వివిధరకాల వ్యాయామాలు చేయించి వాటివలన ప్రయోజనాలు వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయడం దినసరి పనుల్లో భాగంగా తప్పనిసరిగా చేయాలని వ్యాయాయం వలన మానసిక ప్రశాంతత ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే శ్వాస, ఇతర పలురకాల వ్యాయామాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

## మహిళపై దాడి చేసిన వారికి రిమాండ్

మార్కాపురం, మేజర్‌న్యూస్: మార్కాపురం పట్టణంలోని బాపూజీ కాలనీ లోని ఇంటి స్థలం దురాక్రమణ కేసులో గోపాలుని లక్ష్మీ భవాని భర్త లేట్ చంద్ర శేఖర రావు అనువారి ఇంటి స్థలంను ఆక్రమించి, అడ్డువచ్చిన ఫిర్యాదీనీ, దాడి చేసి గాయ పరచిన కేసులో ముద్దాయిలు షేక్ అబ్దుల్ రెహమాన్ తండ్రి అబ్దుల్ సత్తార్ (రియా మొబైల్స్), కందుకూరి శంకరాచారి, సోమా చారి అనువారిని మార్కాపురం టౌన్ అరెస్టు చేసి మార్కాపురంలోని కోర్టు వారి ఎదుట హాజరు పరచగా ముద్దాయిలకు జడ్జి రిమాండ్ విధించడం జరిగింది. ముద్దాయిలు ఇరువురిని మార్కాపురం సబ్ జైలుకు తరలించారన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి దుర్మార్గం




టంగుటూరు, మేజర్‌న్యూస్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిర్, గవాయిపై మను వాద న్యాయవాది దాడి చేయడం దుర్మార్గమని కె.వి.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఅంద్ర మాల్యాద్రి పేర్కొన్నారు. టంగుటూరు ట్రంకు రోడ్డు లోని నాలుగు కూడలి వద్ద మంగళవారం కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై దాడి ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గిరిజనులు ఏ స్థాయిలో ఉన్న మతోన్మాదుల నుండి మనువాదుల నుండి పరంపరగా అవమానాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై మనువాద న్యాయవాది చెప్పుతో దాడి చేయడం అంటే సనాతన పేరుతో నాగరికతను ధ్వంసం చేసే చర్యగా ఉందని అభివర్ణించారు. ఈ దాడి దేశ ప్రజలు సిగ్గుతో తలదించుకునేలా ఉందని విచార వ్యక్తం చేశారు. రాజ్యాంగపరంగా ప్రధాన న్యాయమూర్తి గవై తన విధులను తాను నిర్వహిస్తున్న క్రమంలో న్యాయవాది ముసుగులో దాడి చేయడం ముమ్మాటికీ మతోన్మాద చర్యగా పేర్కొన్నారు. దేశ అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్న దళితులకే ఇలాంటి పరిస్థితులు సంభవిస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటపల్లి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం కూడా లేకపోవడం బాధాకరమని తెలిపారు. అత్యున్నత పదవుల్లో ఉన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయి పై చెప్పుతో దాడి చేసేందుకు ప్రయత్నం చేసిన మతోన్మాది కిషోర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజెస్, టి.రాము, గద్దం సాల్మన్, జి.అంకయ్య, ఎం.యానాది, సీఐటీయూ నాయకులు డి.తిరుమల రావు, టి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి



బాపట్ల, మేజర్‌న్యూస్: పురపాలక సంఘ కార్యాలయము నందు సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మునిసిపల్ కమీషనర్ జి రఘునాథరెడ్డి ఆయన చిత్రపటా నికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి అని ఆయన కొనియాడారు.తపస్సుతో మహనీ యుడుగా మారి ప్రపంచానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి ఆయన. వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తి నిస్తూనే ఉంటుంది. ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం అని కొనియాడారు. కార్యక్రమము నందు రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, పురపాలక సంఘం సిబ్బంది ఉన్నారు.



## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామస్తులు ఏకాభిప్రాయం

మార్టూరు, మేజర్‌న్యూస్: మార్టూరు మండల పరిధి లోని డేగరమూడి గ్రామంలో గ్రామ కంఠం సర్వే నెంబర్ 162లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అన్ని వర్గాలు, కులాల వారు సమ్మతించారు. విగ్రహ ఏర్పాటుకు అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ విషయాన్ని మంగళ వారం ఆర్డీవో, డిఎస్పీ కార్యాలయంలో అందరూ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితనేతలు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం: సూపర్వైజర్



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవంలో భాగంగా పోషణ మహా కార్యక్రమం రామాలయం గుడివద్ద గల అంగన్వాడి కేంద్రంలో మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుభాషిని మాట్లాడుతూ తల్లులకు, గర్భవతులకు పోషకఆహారం గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాహారం ఏ విధంగా తీసుకోవాలి సుభాషిని తెలియజేశారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి,పాలిచ్చే తల్లులు తీసుకోవ లసిన జాగ్రత్తలు గురించి సుభాషిని తెలియజే శారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పోషకాహారం గురించి బాలసంజీవని కిట్స్ గురించి, బాలామృతం గురించి, కోడిగుడ్లు, పాలు, బియ్యం, పప్పు, ఆయిల్ గురించి ఏ విధంగా వాడాలో తల్లులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సుభాషిని వివరించారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టిక ఆహారాన్ని వినియోగించుకోవాలని సుభాషిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండలం సూపర్వైజర్ ఇందిర, ఉల్లగల్లు సూపర్వైజర్ సునీత, దర్శి సచివాలయం 1 మహిళా పోలీస్ ఎం సరస్వతి, దర్శి 1 సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో సొసైటీచైర్మన్

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: సోమవారం రాత్రి పామూరు పట్టణంలోని పువ్వాడి పంక్షన్ హాలునందు జరిగిన పామూరు పట్టణ ప్రముఖులు, రియల్టర్ షేక్ చాంద్ బాషా(సెంట్రింగ్ బుజ్జి)కుమారుడు మహమ్మద్ హుస్సేన్ వివాహ వేడుకల్లో సిఎస్ పురం మండల పిఎసియస్ అధ్యక్షుడు చెరుకుపల్లె వెంకటరెడ్డి ఏయంసి చైర్మన్ యారవ రమాశ్రీనివాస్, పామూరు మండల టిడిపి అధ్యక్షుడు బొల్లానరసింహారావు పలువురు నాయకులతో కలసి పెండ్లికుమారుడు మహమ్మద్ హుస్సేన్ ను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లె వెంకటరెడ్డి, యం.వి.నారాయణరెడ్డి, పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

## శబ్ధ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు హాని

- పోలీస్ అనుమతి తప్పనిసరి
- డీజే సౌండ్ బాక్సులు వాడరాదు
- సిఐ వై.రామారావు



దర్శి, మేజర్‌న్యూస్: విపరీతమైన శబ్ద కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు హాని జరిగి హార్ట్ ఎటాక్ వంటి వ్యాధులతో చనిపోవడం జరిగిందని దర్శి సీఐ వై.రామారావు అన్నారు. దర్శి ముండ్లమూరు తాళ్లూరు మండలాల పరిధిలో ఫంక్షన్లకు తిరునాళ్లకు ఏదైనా ఇతర కార్యక్రమాలకు ఎవరైనా మైకు సిస్టం వాడే సమయంలో డీజే లకు అనుమతి లేదని దర్శి సర్కిల్ ఇన్స్పెక్టర్ వై రామారావు తెలిపారు. డీజేలను అధిక సంఖ్యలో వాడటం వల్ల ఆ శబ్దాలకు ఈ మధ్యకాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె జబ్బు సమస్యలు ఉన్న వారు కూడా చనిపోవడం జరుగుతోందన్నారు. ఎవరైనా ఎలాంటి ఫంక్షన్లు, ఉత్సవాలు తిరునాళ్లు అలాగే మీటింగులు జరుపుకోవాలని ఉంటారో వారు ఖచ్చితంగా స్థానిక ఎస్సై ద్వారా సబ్ డివిజనల్ పోలీస్ అధికారికి పర్మిషన్ అప్లై చేసుకోవాలని సూచించారు. పర్మిషన్ పొందిన వారు మైకు లేదా ఏదైనా సౌండ్ బాక్స్లు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ సౌండ్ మించ కుండా ఉండేలా చూసుకోవాలని కోరారు. అలాకాకుండా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించిన ట్లయితే అటువంటి వారిపైన చట్టపరమైన టువంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ రామారావు హెచ్చరించారు.

## బుధ, గురు వారల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దర్శి, మేజర్‌న్యూస్: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 06గంటల వరకు 9వ తేది అనగా గురువారం ఉదయం 6 గం నుండి 9గం.లవరకు 33 కెవి దర్శి ఫీడర్ లైన్ మెయింటెనెన్స్, నూతన లైన్ లు ఏర్పాటు చేయు కారణంగా దర్శి ఎన్ఎస్పీ కొత్త సబ్ స్టేషన్ పరిధిలో ఉండే అద్దంకి రోడ్డు పుచ్చలమెట్ట ఆటోనగర్ మోటుపల్లి రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. దర్శి వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించగలరని దర్శి టౌన్ ఎఈ సచిన్ కుమార్ తెలిపారు.

# రైతు పక్కనే కూటమి ప్రభుత్వం

- యూరియా కొరత ఎక్కడా లేదు
- యూరియా పంపిణీ చేసిన ఏఎంసీ ఛైర్మన్ యారవ రమాశ్రీనివాస్



పామూరు, మేజర్‌న్యూస్: రైతు పక్కనే ప్రభుత్వం నిలబడి ఉందని యూరియా, నానో యూరియా, డిఏపి వంటి ఎరువుల కొరత ఎక్కడా లేదని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమాశ్రీనివాస్ అన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని దూబగుంట గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు దయండే శివశంకర్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా, నానో యూరియా, డిఏపి ఎరువుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యారవ రమా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియాలో యూరియా కొరతపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవాలు అన్నారు.ప్రభుత్వం రైతు పక్షాన బలంగా నిలబడి ఉందన్నారు. ప్రతి రైతుకీ అవసరమైనంత యూరియా, నానో యూరియా, డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని ఎరువుల సరఫరా సజావుగా కొనసాగుతుందన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని తెలిపారు.రైతు నమ్మకం కోల్పోకుండా ధైర్యంగా సాగు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. యూరియా పంపిణీ కార్యక్రమంలో టిడిపి దూబగుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు దయండే శివశంకర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అనూష, శ్రీనివాసులు రెడ్డి, పోతురాజు వెంకట్రావు, నాగేశ్వరరావు, ప్రభాకర్, వెంకటేశ్వర రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.




## సుప్రీంకోర్టు జడ్జిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

బాపట్ల, మేజర్‌న్యూస్: సనాతనం ముసుగులో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను బహిష్కరించాలని సిపిఎం పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు జడ్జి బి.ఆర్.గవాయి పై దాడి చేసిన మతోన్మాది రాకేష్ కిషోర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ సిహెచ్ మంజుధర్, పి.కొండయ్య కే.శరత్, కే.నాగేశ్వరావు, టి.సుభాషిణి, సుభాని, వలి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో కమిషనర్ సుడిగాలి పర్యటన



బాపట్ల, మేజర్‌న్యూస్: పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ రగునాథ్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. యాదవ పాలెం 13వ వార్డు డ్రైనేజీ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. 28,29 వార్డులు కొట్రా వారి వీధి ప్రాంతాల నందు పారిశుద్ధ్య పనితీరును స్వయంగా పరిశీలించారు. డ్రైనేజీ పూడికలను సిబ్బందిచే దగ్గరుండి తొలగింప చేశారు. పారిశుద్ధ్య విభాగ సిబ్బంది విభాగ సిబ్బంది సచివాలయ పర్యావరణ వార్డుల నందు రోజు పర్యటించి పారిశుధ్యం మెరుగుదలకు కృషి చేయాలి అన్నారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలుగా వేరు చేసిన తర్వాతే గృహ యజమానుల నుండి తీసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం దిశగా దుకాణాలను తనిఖీ చేసి అపరాధ రుసుములు విధించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం: సిడిపిఓ

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని వెలుగు ఆఫీస్ నందు పోషణ మహ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి గోపి పాల్గొని మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బిడ్డ ప్రశ్నించిన వెంటనే ముర్రుపాలు తాపించాలని అంగన్వాడి సెంటర్ నందు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి తల్లిదగ్గర బిడ్డకు సరిపడే పాలు ఉంటాయని తెలుసుకోవాలన్నారు. అనంతరం చైల్డ్ మ్యారేజ్ పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సిడిపిఓ ఆశా బేగం, సూపర్వైజర్ వెంకటలక్ష్మి, పంచాయతీ ప్రెసిడెంట్ కత్తి రాజారావు, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# ట్రేడింగ్ యాప్ పేరుతో ఘరానా మోసం

### పేస్ బుక్ పరిచయంతో రూ.1.16 కోట్లు పోగొట్టుకున్న వ్యాపారి

కనిగిరి, మేజర్‌న్యూస్: పేస్ బుక్‌లో పరిచయంతో ద్విచక్ర వాహనం షోరూమ్ యజమాని ట్రేడింగ్ యాప్‌లో 1.16 కోట్లు రూపాయలు పోగొట్టుకున్న సంఘటన కనిగిరి పట్టణంలో వెలుగులోకి వచ్చింది. కనిగిరి పట్టణంలో ద్విచక్ర వాహనాల షోరూమ్ యజమానికి పేస్ బుక్‌లో కొద్దిరోజుల క్రితం శరణ్య రెడ్డి అనే యువతి పరిచయం అయ్యింది. తరచూ ఆయువతి షోరూమ్ యజమానితో పేస్ బుక్ లో చాటింగ్ చేసేది. గోల్డ్ మానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఉందని ట్రేడింగ్ యాప్ లో పెట్టుబడి పెడితే అధిక లాభం వస్తుందని మాయమాటలు చెప్పి నమ్మించింది. అది నమ్మిన ద్విచక్ర వాహనం షోరూమ్ యజమాని ముందుగా 50 వేలు పెట్టగా లాభం చూపించింది. అదినమ్మి మోసపోయిన వ్యక్తి రెండు నెలల్లో ఏకంగా 1.16 కోట్లు ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి తాలూకు నగదు తిరిగి చెల్లించమని అడగడంతో శరణ్యరెడ్డి గొడవకు దిగి తిరిగి ఇవ్వకుండా బ్లాక్ మెయిల్‌కు దిగింది.ఆయువతి తన పేస్ బుక్ ఐడి కూడా బ్లాక్ చేసింది .ఆమె చేతిలో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు పిర్యాదు చేశాడు. వ్యాపారి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత మూడు నెలల క్రితం కనిగిరిలో రిటైర్డ్ ఎంఈవో కూడా ఇలాంటి ఉచ్చులో పడి దాదాపు 30 లక్షలు నష్ట పోయిన సంఘటన మరవక ముందే మరలా ఇలాంటి సంఘటన జరగడంతో పట్టణంలో చర్చినీయాంశం అయ్యింది.

## గవర్నర్‌ను కలిసిన పాశం వెంకటేశ్వర్లు యాదవ్



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్ల అమలుకు ముందస్తుగా విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమాజ్ వాది పార్టీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ వెల్లడించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల తరహాగా రాష్ట్రంలోను జనగణనలో కులగణన చేపట్టాలని, ఆ దిశగా స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరామన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు రామకృష్ణ నేతృత్వంలో పార్టీ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, బీసీ సంఘాల నేతలు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, సమాజ్‌వాద్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకులు ఆర్ఎస్ యాదవ్ తదితరులతో కూడిన బృందం వినతిపత్రం అందజేసింది. విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి బీసీలకు దామాషా రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. వెనుకబడిన తరగతుల సామాజిక-ఆర్థిక పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయడానికి, ఖచ్చితమైన ఆధారాల ఆధారిత విధాన ప్రణాళిక కోసం ఒక ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించామని వివరించారు.




## జిఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: వస్తు సేవ పన్ను(జిఎస్టీ) తగ్గింపుద్వారా విద్యార్థులకు పలుప్రయోజనాలు చేకూరుతా యని ఎంఇఓ ఆర్.కొండారెడ్డి అన్నారు. మంగళవారం సిఎస్ పురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహించి జిఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల వస్తుసేవపన్ను తగ్గించడం వలన సామాన్యులకు లబ్దిచేకూరుతున్నట్లు జిఎస్టీ తగ్గింపుపై విద్యార్థులు ప్రజలకు వివరించాలని అన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజనం నాణ్యతను రుచిని ఎంఇఓ పరిశీలించి వంట నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగింత



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని దోర్నాల గ్రామంలోని గిరిజన చెంచు కాలనీ చెందిన జగన్నాథం. రిషి అను బాలుడు తప్పిపోయిన పోయినాడు. బాలుడి ఫోటో సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దోర్నాల ఎస్సై వి.మహేష్ బాలుడు కోసం ఐదు బృందాలుగా పోలీసులు ఏర్పడి ఆచూకీ కోసం తీవ్రముగా శ్రమించి వెతికి పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులకు మంగళవారం సాయంత్రం పోలీసులు అప్పగించారు. బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పోలీస్ వారికి ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం డి.ఎస్.పి. నాగరాజు, దోర్నాల పోలీసులను అభినందించారు.



## గురు ప్రసాద్‌ను అభినందించిన గ్రామస్తులు

దర్శి, మేజర్‌న్యూస్: చందలూరు జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయులు గంధం గురు ప్రసాద్‌ను గ్రామస్తులతోపాటు, అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా పాఠశాల విభాగంలో జిల్లా స్థాయిలో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవార్డును దక్కించుకుంది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంధం గురు ప్రసాద్ సోమవారం ఒంగోలులో జరిగిన స్వచ్ఛ అవార్డుల కార్యక్రమంలో స్వీకరించడం జరిగినది. ఎంపీడీవో పి.కల్పన, ఎంఈఓ కె.రఘురామయ్య, వివిధ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాల సిబ్బంది గురు ప్రసాద్‌ను అభినందించారు.




## డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

దర్శి, మేజర్‌న్యూస్: పట్టణంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలు నివారణ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు దర్శి డి.ఎస్.పి లక్ష్మి నారాయణ పర్యవేక్షణలో మంగళవారం దర్శి టౌన్‌లోని వివిధ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు నుండి వచ్చిన రోసీ అనే పోలీసు జాగిలంతో పరిశీలించారు. పొదిలి రోడ్డు అద్దంకి రోడ్డు కురిచేడు రోడ్డు ప్రాంతాలలో విస్తృత తనిఖీలను పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి సిఐ యేండ్లూరి రామారావు, ఎస్ఐ మురళి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ చేసిన గుంటూరు రేంజ్ ఐజీ



ఉలవపాడు, మేజర్‌న్యూస్: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ నందు రికార్డ్స్ పరిశీలించారు. ఇందులో భాగంగా డ్రోన్ కెమెరా ఉపయో గించడం రౌడీషీటర్స్ పై నిఘా ఉంచడం వంటి నేరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటిని పరిష్కరించి బాధ్యులకు సత్వర న్యాయం చేసేలా చూడాలని, ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయమని చెప్పడం జరిగింది.అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిసరా లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఎస్సై అంకమ్మకు తెలి పారు.వీరివెంట కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం, సిఐ ఉన్నారు.

## ఘనంగా కొత్తూరులో పౌష్టికాహార వారోత్సవాలు



పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు గ్రామం లోని అంగన్వాడి కేంద్రం (సెంటర్ కోడ్ 611)లో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీబాయి, సూపర్వైజర్ అంజమ్మ, జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మీబాయి మాట్లాడుతూ, పౌష్టికాహారంలో ఉండే ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరానికి ఎంతగానో అవసరమని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శిశువు ఆరో గ్యంగా పెరగడమే కాకుండా తల్లి ఆరోగ్యంపై కూడా ప్రభావం ఉంటుందని ఆమె వివరించారు. జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ మాట్లాడుతూ, పౌష్టికాహార వారోత్సవాల లక్ష్యం ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు మార్గదర్శనం చేయడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొని పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కార్యకర్త విజయమ్మ సహా పలువురు గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఆర్డీవో నిత్యవసరాలు పంపిణి



బాపట్ల, మేజర్‌న్యూస్: మండలంలోని నందరాజు తోట పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర వస్తువులు ఆర్డీవో గ్లోరియా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎండ, వానను లెక్కజేయకుండా తెల్లవారు జామున వీదులను శుభ్రం చేసి పరి శుభ్రతను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ షలీమా, ఎంపీడీవో బాబురావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

# 'జస్టిస్ గవాయిపై దాడి చేసిన దోషిని కఠినంగా శిక్షించాలి'

ఒంగోలు, మేజర్‌న్యూస్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై ఒక మతోన్మాది బూటు విసరడం అనేది అత్యంత అమానుషమైన చర్యగా, అది భారత రాజ్యాంగం పై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఆ దారుణానికి పాల్పడిన దోషిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా మంగళవారం నగరంలోని సాగర హెూటల్ సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాలు ఆంజనేయులు మాట్లాడుతూ జస్టిస్ గవాయి పై జరిగిన దాడి అది వ్యక్తిగతమైనది కాదని, భారత రాజ్యాంగం మీద, భారత ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం మీద దాడిగా భావిస్తున్నామని ఆయన అన్నారు. మతోన్మాద చర్యలకు పాల్పడినటువంటి దోషులకు పాలకులు మద్దతి స్తున్నారని మత చిచ్చు రగిలించి కుట్రలు కుతంత్రాలకు పాల్పడే వారికి జైళ్ళ నుంచి సాదర స్వాగతాన్ని పాలకులు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు




కెఎఫ్ బాబు, బండి వీరాస్వామి, ప్రజా సంఘాల నాయకులు జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసులు జి.రమేష్, పి.కల్పన, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, నెరుసుల వెంకటేశ్వర్లు, జాలా అంజయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, విమోజస్, ఎస్డి హుస్సేన్, యం.శేషయ్య, రాంబాబు, బి.వి.రావు, చిరంజీవి, భక్త సింగ్ రాజు, జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, ఎం.మాలతి, డి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో ఏఎంఆర్ చర్చలు

చీమకుర్తి, మేజర్‌న్యూస్:గత వారం రోజులుగా గెలాక్సీ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్త సంఘాల ఆధ్వర్యంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు మూత వేసి సమ్మె చేస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే. గ్రానైట్ సీనరీజ్ వసూలు ఏ.ఎం.ఆర్ ప్రైవేట్ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమానులు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులకు గ్రానైట్ క్వారీ యజమానులు మరియు ఫ్యాక్టరీ యజమానులకు చర్చలు మంగళవారం ఒంగోలులోని అసోసియేషన్ హాల్లో జరిగాయి. గతంలో రెండుసార్లు చర్చలు జరిగిన ఎలాంటి ఫలితం లేదు. మంగళవారం నాడు జరిగిన చర్చలు కూడా అర్ధాంతరంగానే ముగిశాయి. ఫ్యాక్టరీ యజమానులు రూ 27 వేల రూపాయలు, ప్రభుత్వం పెంచిన మరో 8 వేల



రూపాయలు మొత్తం కలిపి రూ 35 వేలు మాత్రమే చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తమ సంస్థ యాజమాన్యానికి తెలియపరచి తగు నిర్ణయం తీసుకుంటామని ఏ ఎం ఆర్ ప్రతినిధులు నిహాంత్ తెలిపారు. దీంతో చర్చలు మరో దఫా జరిగే

**అర్ధాంతరంగానే ముగిసిన చర్చలు**
**చర్చలు మరో దఫా జరిగే అవకాశం**

అవకాశం ఉంది. మరో వైపు గ్రానైట్ ఫ్యాక్టరీలు పూర్తిస్థాయిలో మూత వేసి యజమానులు సమ్మె కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చలువాది బదరీ నారాయణ, ఆర్ పి రవి, సిద్ధ భరత్, భాస్కర్ రెడ్డి, శిల్పా, ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మార్వెల్ బుజ్జి,కాట్రగడ్డ రమణయ్య, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, సిహెచ్ మస్తాన్ రెడ్డి,బి వి ఎల్ వెంకటరావు, పంగులూరు సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మంచా ఏరియాకు కాటమాల సన్మానం



కంభం, మేజర్‌న్యూస్: పట్టణంలో మంగళ వారం షెడ్యూల్ కులాలకు హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్య క్షులు దళితరత్న నేషనల్ అంబేద్కర్ రత్న కాటమాల చెన్నకేశవరావు కంభంలోని ఎస్‌సిఆర్‌పియస్ ఆఫీసుకు మార్కా పురం హల్లెలూయ ప్రార్ధనా మందిర రెవరెండ్ అధినేత మంచా ఏలియా ఇటీవల గత నెల 8వ తేదీ నుండి 28వ తేదీ వరకు ప్రపంచ 13 దేశాలు పర్యటించి రొమ్‌లోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోపుని కలిసి ఆశీర్వాదాలు తీసుకొని అనేక బైబుల్ కు సంబంధించి ముఖ్యమైనవి సందర్శించి మంగళవారం కంభంలోని రాష్ట్ర ఎస్‌సిఆర్‌పియస్ ఆఫీస్‌ను సందర్శించి ప్రపంచ దేశాల్లో సందర్శించి నప్పుడు కొన్ని ముఖ్యమైన ఘటనల గురించి చర్చించిన సందర్భంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

## 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డు గ్రహిత డిపివో వెంకటేశ్వరావుకు కలెక్టర్ అభినందనలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: సోమ వారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా డిపివో వెంకటేశ్వర్లు 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డు అందుకున్నారు. అవార్డు



పొందిన డిపిఓ వెంకటేశ్వ రరావు మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. అవార్డులు వచ్చేలా పనితీరు కనపరిచినందుకు వారిని కలెక్టర్ అభినందించారు.



## గాజాపై రక్తపాతం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ దాడులు నిలిపి వేయాలి

### దాడులను నిరసిస్తూ 21న శాంతి ప్రదర్శన

ఒంగోలు, మేజర్‌న్యూస్: గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న పాశవిక దాడులు మానవత్వాన్ని సిగ్గుపడేలా చేస్తున్నాయని, పాలస్తీనా ప్రజలపై రక్తపాతం సృష్టిస్తున్న మారణకాండను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గాజాపై దాడులు ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఒంగోలు సుందరయ్య భవన్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), సిపిఎం(ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై నరమేధం సృష్టిస్తూ, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులను విచక్షణారహితంగా హతమారుస్తోందని తీవ్రంగా ఖండించారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ నేరానికి తెరలేపిందని, ఆసుపత్రులు, పాఠశాలలు, నిర్వాసితుల శిబిరాలు బాంబుల వర్షంలో మునిగిపోయి మానవతా విలువలు మంటగలిసాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ వామపక్షాలు శాంతికాముకులను, ప్రజాస్వామ్య శక్తులను కలుపుకొని గాజా ప్రజలకు సంఘీభావం ప్రకటిస్తూ, అక్టోబర్ 21న అద్దంకి బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించాలని తీర్మానం చేశారు. తొలుత గాజా యుద్ధంలో మరణించిన ప్రజలకు సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎం.ఎస్. సాయి, సిపిఎం(ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఆర్.మోహన్, సిపిఎం నాయకులు జి.వి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సిపిఐ(ఎంఎల్) నాయకుడు పరిటాల కోటేశ్వరరావు, ఎం.ఎల్.న్యూ డెమోక్రసీ నాయకులు చొప్పర జాలన్న, ఎల్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా పిడి శ్రీహరికి 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డు ప్రదానం

### – అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు, మేజర్‌న్యూస్ : సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మెప్మా పిడి శ్రీహరి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును పిడి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు ప్రత్యేకంగా శ్రీహరిని అభినందించారు.



## త్వరలో ప్రధాని నరేంద్రమోడీనీ గద్దెదింపి తీరుతాం

### ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన నరేంద్రమోడీని ప్రజలు క్షమించరు

### కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీపతి సతీష్



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఓట్ల దొంగ గద్దె దిగు అనే నినాదంతో ప్రజల మద్దతు కోరుతూ కొండేపి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ టంగుటూరు మండలం ఆలకూరపాడు అనంతవరం గ్రామాలలో జరిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఓట్ చోర్ గద్దె చోడ్ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా కొండేపి నియోజకవర్గంలో తాము ప్రజల మద్దతు కోరుతున్నామని ప్రజలు కూడా నరేంద్ర మోడీ పట్ల విసిగి వేసారి పోయి ఉన్నారని కేవలం దొంగ ఓట్లు లక్షలలో చేర్చుకొని తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించారని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని తెలిపారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఉద్యమంలో దేశ ప్రజలను ఆకర్షించారని రాబోవు రోజుల్లో నరేంద్ర మోడీకి గడ్డు కాలమే అని రేపు బీహార్ ఎన్నికలలో కాంగ్రెస్ కూటమి దుందుభి మోగిస్తుందని రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ వైయస్ షర్మిలారెడ్డి నేతృత్వంలో బలపడబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ వల్ల రాష్ట్రానికి ఏ ప్రయోజనం కలగడం లేదు కాబట్టి చంద్రబాబు కూడా బిజెపికి మద్దతు ఉపసంహరించాలని సతీష్ కోరారు. సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం బిజెపి పట్టు కోల్పోతుంది అన్న చెప్పడానికి ఇదే నిదర్శనం అని సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.శశి కుమార్, టంగుటూరు మండల నాయకులు గంగుల పోలయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి మహేష్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏసుపోగు దావీదు, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వాడకాన్ని నివారించాలి: సిఐ




పొదిలి, మేజర్‌న్యూస్: స్థానిక పట్టణంలోని సెంట్ మేరీస్ బి.ఈ డి కళాశాలలో నేడు ఈగిల్ క్లబ్ టీమ్ సహకారంతో మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పాల్గొన్న పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న టీచర్లు,విద్యా ర్థులకు మత్తు పదార్థాల వాడకానికి సంబంధించిన చట్టపరమైన పరిణామాలు, వ్యక్తిగత మరియు సామాజిక నష్టం, మరియు యువతపై వాటి ప్రభావం గురించి వివరించారు. అలాగే ఎవరైనా మత్తు పదార్థాలను కొనుగోలు చేయడం, అమ్మడం, తరలించడం లేదా వాడడం చేసినా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,ప్రతి ఒక్కరూ ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈగిల్ క్లబ్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు శిక్షణార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపునందు విద్యార్థులు పోలీసు విభాగానికి మరియు ఈగిల్ క్లబ్ సభ్యులకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఒంగోలు పట్టణంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్ ఓబులేసు అధ్యక్షతన నిర్వహించిన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని, వృద్ధులు, సంఘాలు, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వృద్ధుల సంక్షేమం, రక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధుల సంఘ ప్రతినిధులు తమ అనుభవాలను సభాముఖంగా పంచుకుని, సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థనలు సమర్పించారు. ఈ సందర్భంగా వృద్ధుల సేవలో విశేషంగా సహకరించిన వృద్ధులను సన్మానించిన్నారు.

# మోసపోయాను.. న్యాయం చేయండి

### ప్రేమ పెళ్లి చేసుకొని నడ్డిరోడ్డు మీద వదిలేసిన భర్త

### పెళ్లయిన ఆరు నెలలకే ఓ వివాహిత దీనగాథ





ఒంగోలు కార్పొరేషన్, మేజర్‌న్యూస్: మైనార్టీ తీరక ముందే ఆమెకు పెద్దలు పెళ్లి చేశారు. ఓ బిడ్డ పుట్టిన తరువాత ఆభర్త ఆమెను వేధింపులకు గురి చేశాడు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసై రోజూ నరకం చూపించాడు. అతని హింస తట్టుకోలేక పెద్దల సమక్షంలో అతని నుంచి వేరుపడి తన బతుకు తాను చూసుకుంది. తన కడుపున పుట్టిన బిడ్డనే చూసుకుంటూ కష్టం చేసుకొని తల్లి చెంతన జీవిస్తున్న ఆమెకు ఇన్‌స్టాలో మరో వ్యక్తి పరిచ యమయ్యాడు. తనను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పాడు. పాల డెయిరీలో పని ఇప్పిస్తానని చెప్పి తన స్వస్థలానికి పిలిపించుకున్నాడు. నీకు అండగా ఉంటానని చెప్పి అతని కుటుంబ సభ్యుల సమక్షమంలోనే గుడిలో పెళ్లి చేసుకుని ఆరు నెలలు కాపురం తరువాత నువ్వు నాకొద్దంటూ బయటకు గెంటేశాడు. వివరాల్లోకి వెళితే...

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడానికి దీపకకు 14 ఏళ్లకే దొడ్డి నవీన్‌తో జంగారెడ్డి గూడెంలో వివాహమైంది. కొంతకాలానికి వారికి పాప పుట్టింది. భర్త మద్యం తాగి, డ్రగ్స్‌కు బానిసై కొట్టడం ప్రారంభించాడు. నిత్యం చిత్రవధ చేస్తుండటంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పెద్దల సమక్షంలో దీపక, నవీన్‌లు విడిపోయారు. జంగారెడ్డి గూడెంలో తల్లి చంద్రం వద్దకు చేరింది. ఇటీవలే చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కంట్లం అజయ్ అనే యువకుడితో ఇన్‌స్టాలో పరిచయమైంది. తనకు పాల డెయిరీ ఉందని, తన వద్ద చాలా మంది పని చేస్తున్నారని, నీవు నా దగ్గరకు వస్తే పని చూపిస్తానని, తరువాత పెళ్లి చేసుకుంటానని అజయ్ చెప్పాడు. దీంతో ఆమె అతని మాటలు నమ్మి తల్లి, బిడ్డను వదిలి కొద్ది మాసాల కిందట అజయ్ సొంతూరుకు చేరింది. అక్కడ నుంచి ఆమెను ఒంగోలు మండలం వలేటివారిపాలెం తీసుకువెళ్లిన అజయ్ అక్కడ గుడిలో మే 17న పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల పాటు కాపురం అనంతరం నువ్వు వద్దంటూ అడ్డం తిరిగాడు. దీంతో ఆమె స్థానికుల సాయంతో 16న చీమకుర్తి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు అజయ్‌పై కేసు నమోదు చేశారు. అజయ్ తల్లి, అతని సోదరి కలిసి దీపకను ఇంట్లోకి రానివ్వలేదు. సమీపంలోని గుడిలోనే ఉంటోంది. పల్లామల్లి నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలు వచ్చి తన భర్త మోసం చేశాడని, తనపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకుంటూ గత నెల 22న కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేసుకుంది. తరువాత దిశా పోలీసు స్టేషన్‌కు వెళ్లితన బాధ చెప్పుకుంది.

## భూగర్భ జలమట్టం పెంపుపై వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లాలో భూగర్భ జల మట్టం మరింత పెరిగేలా గ్రామ స్థాయిలో వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికతో పాటు గ్రామాల వారీగా వాటర్ డిమాండ్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు భూగర్భ, జల వనరుల శాఖ, డ్వామా, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానశాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమై జిల్లాలో గ్రామ స్థాయిలో వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికల రూపకల్పనపై సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు పెరగడానికి గ్రామ స్థాయిలో వాటర్ మేనేజ్మెంట్ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ఎస్.ఈలు వరలక్ష్మి, బాల శంకరరావు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, గ్రౌండ్ వాటర్ శాఖ డిడి వందనం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఎపిఎంఐపి పిడి శ్రీనివాస రావు, డ్వామా, వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శబాష్ సిఐ అంటూ హల్‌చల్ చేసిన ఆకాశ రామన్న లేఖ

### అర్బన్ సిఐ రాంబాబు పనితీరుపై ప్రశంసలు కురిపిస్తూ లేఖ

సూర్యప్రతినిధి బాపట్ల



బాపట్ల పట్టణంలో 20 సంవత్సరాల తర్వాత పోలీసులు ప్రజా క్షేత్రంలో ప్రజలతో కలిసి పని చేయడం హర్షించదగిన విషయమని పట్టణ సీఐ రాంబాబు సేవలను కొనియాడుతూ ఆకాశ రామన్న లేక చర్చ అంశంగా మారింది. బాపట్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలముగా మారినప్పటికీ సీఐ రాంబాబు ఆలోచన విధానాలతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం విషయమని ఆకాశ రామన్న లేఖన సారాంశంగా కనిపిస్తుంది. అలాగే నేర నియంత్రణ, దొంగతనాలు, గంజాయి రవాణా అరికట్టడంలో సిఐ రాంబాబు ప్రధాన భూమిక పోషించడం సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు అని లేఖలో పేర్కొన్నారు. అదే క్రమంలో ఆకతాయిలకు బుద్ధి చెబుతూ, శాంతి భద్రతలకు విగాదం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకొనడంలో సిఐ రాంబాబు ముందుంటారని ఆకాశ రామన్న లేక లో వ్రాయబడింది. అలాగే నడిరోడ్డుపై కారులను ఆపి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్న వారిపై పట్టణ పోలీసులు తగు చర్యలను తీసుకోవాల్సినదిగా ఆకాశ రామన్న లేఖన సారాంశంగా కనిపిస్తుంది. ఆకాశ రామన్న లేఖనాలు బాపట్లకు రావడం చాలా సంవత్సరాల తర్వాత కనిపించడం విశేషం.



## అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

చీమకుర్తి, మేజర్‌న్యూస్: సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ పై చెప్పు విసిరిన లాయర్ రాకేష్ కిశోర్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్ లతో

బిసి సంఘం,కుల నిర్మూలన పోరాట సమితి, ఏకలవ్య యూత్, సిపియం, సిఐటియు,కుల వివక్షపోరాట కమిటీ,జేఎసి,యం.ఆర్పీ.యస్, ప్రజా కళా మండలి,దళిత సేవా సమితి వివిధ ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో యం.ఆర్.పి.యస్ జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్ మాదిగ,ప్రజాకవి పిన్నిక శ్రీనివాస్,యం.ఆర్.పి.యస్ ప్రధానకార్యదర్శి బుట్టా సాల్మన్ మాదిగ,కే.వి.పి.యస్ జిల్లా ఉపాధ్యక్షులు టి.రామారావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య,ఎకలవ్య యూత్ నాయకులు శ్రీకాంత్, యం.ఆర్.పి.యస్ నాయకులు బక్కా మోషే,నరేష్,ఆదాం,చంద్రయ్య పాల్గొన్నారు